
94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 164 సీట్ల భారీ విజయంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ప్రజలే ప్రజాస్వామ్య శక్తిని చాటుతూ చారిత్రాత్మక తీర్పునిచ్చారు. ప్రభుత్వానికి అండగా నిలిచిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 18.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 57 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# ఫీల్డ్‌లోకి వెళ్లాల్సిందే..!

- అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి చేసిన సీఎం చంద్రబాబు
- వారంలో మూడు రోజులు ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలని ఆదేశం
- పనితీరుపై 360 డిగ్రీల మూల్యాంకనానికి సిద్ధం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఒక్క అధికారి క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ నెల నుంచి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పాలనా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు దాటింది. తప్పులు జరగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి. లోపాలు ఏమైనా ఉంటే వాటిని ఏ విధంగా సరి చేయాలనే అంశం మీద ఫోకస్ పెట్టాను. అధికారులు, ఉద్యోగులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలి. ప్రజలకు సేవలు అందించే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాలి. ఫీల్డులోని సమస్యలను స్వయంగా పరిశీలిస్తే అధికార యంత్రాంగం మీద ప్రజల్లో మరింత నమ్మకాన్ని పొందగలం. తనిఖీలు చేస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆ దిశగా ఉన్నతాధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి అధికారి వరకు అందరూ పని చేయాలి. జూలై నెల నుంచి ప్రతి అధికారి ఫీల్డుకు వెళ్లాల్సిందే. వారంలో మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే చెప్పాం. దాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలి. జిల్లా కలెక్టర్లు ప్రతి నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలని సూచించాం. దాన్ని పక్కాగా అమలు చేయాలి. అలాగే నియోజకవర్గాల నోడల్ అధికారులు నెలలో ఒకే మండలాన్ని నాలుగు సార్లు సందర్శించాలి. అధికారులు, ఉద్యోగుల పనితీరు మీద 360 డిగ్రీల్లో విశ్లేషిస్తాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**దేవాదాయ శాఖ పనితీరు మరింత మెరుగవ్వాలి :** "దేవాలయాల్లో భక్తులకు మరింత సేవలు అందించేలా దేవదాయ శాఖ మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం కన్పిస్తోంది. దేవదాయ శాఖ ఉద్యోగుల పనితీరు మరింత మెరుగుపడాలి. అన్ని శాఖల్లోని ఉద్యోగుల పనితీరు ఎప్పటికప్పుడు మెరుగుపడాలి. ఈ మేరకు ఉద్యోగులకు అవసరమైన శిక్షణ ఇప్పించాలి. పరిపాలనలో సింగపూర్ దేశం వినూత్న విధానాలను అవలంభిస్తోంది. పరిపాలన విషయంలో ఆ దేశ విధానాలను పరిశీలించాలి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మొత్తంగా 11,600 గుంతలు ఉన్నట్టు గుర్తించాం.

మిగతా 2లో...





# మంగళగిరికి యూజీడి వరం

- రూ.1,167 కోట్ల యూజీడీ ప్రాజెక్టుకు లోకేష్ శంకుస్థాపన
- ఎంటీఎంసీ పరిధిలో 531 కి.మీ. భూగర్భ డ్రైనేజీ నెట్‌వర్క్ నిర్మాణం
- 20 మురుగునీటి శుద్ధి కేంద్రాలు, 18 లిఫ్ట్ స్టేషన్ల ఏర్పాటు
- దశాబ్దాల సమస్యకు చెక్.. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ఎంటీఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ వ్యవస్థ నిర్మించి మురుగు కనుమరుగయ్యేలా చేస్తామని ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది. తాడేపల్లిలోని ప్రాతూరు రోడ్డులో మంగళగిరి, తాడేపల్లి నగర ప్రజల చిరకాల కోరిక అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి పథకం మొదటి దశ పనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అంతకుముందు తాడేపల్లిలోని ప్రాతూరు రోడ్డుకు చేరుకున్న మంత్రి లోకేష్ కు టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రజా ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. తొలి ప్రాధాన్యంగా భూగర్భ డ్రైనేజీ డీపీఆర్ లు రూపొందించారు. నిధులు మంజూరుతో పాటు పరిపాలన అనుమతులు తీసుకువచ్చారు. దీంతో దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

**రూ.1,167 కోట్ల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం :** మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ(యూజీడీ)ను రూ. 1,167.50 కోట్లతో నిర్మించనున్నారు. రాజధాని గ్రామాలు బేతపూడి, నవులూరు, యర్రబాలెం, నిడమర్రు, పెనుమాక, ఉండవల్లి గ్రామాలు మినహా మొత్తం ఎంటీఎంసీ ప్రాంతంలో డీసెంట్రలైజేషన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు మురుగుశుద్ధి కేంద్రాలు నిర్మాణాన్ని హైబ్రిడ్ అన్యుటీ మోడ్ లో రెండు దశల్లో పనులు చేపట్టనున్నారు.

మిగతా 2లో...



# ఓటరే ప్రజాస్వామ్య బలం

- ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపు



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్.ఐ.ఆర్)ను విజయవంతం చేయాలని తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. తెనాలి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణ, నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియపై పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలకు ఆయన సూచనలు చేశారు.ప్రతి వార్డులో ఓటర్ల పరిశీలన కార్యక్రమం కొనసాగుతోందని, ఎవరైనా బీఎల్ఏగా నమోదు చేసుకోవాలనుకుంటే సంబంధిత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్సీ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) అంటే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమమని, ఓటరు జాబితాలను ఖచ్చితంగా, తాజాగాను ఉంచేందుకు భారత ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వివరించారు.

ఎస్.ఐ.ఆర్ ద్వారా కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసిన వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చడం, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, వివరాల్లో తప్పుల సవరణ, నకిలీ నమోదుల తొలగింపు వంటి చర్యలు చేపడతారని పేర్కొన్నారు.

మిగతా 2లో...

# అభిమాని కోసం అడుగులు..

- హనుమకొండలో నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించిన పవన్
- 'నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది' అంటూ భావోద్వేగ సందేశం
- కుటుంబానికి అండగా ఉంటానని భరోసా



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ (ఖుఖుఅ ఖుశ్రీఖుఅ) బుధవారం హనుమకొండలో పర్యటించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్(17) అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఈ ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే బాలుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం,

మిగతా 2లో...

# రుషికొండ ప్యాలెస్‌కు పునర్వైభవం


- ప్రభుత్వ నియంత్రణలోనే పీపీపీ విధానంలో నిర్వహణ
- విశాఖ సెంటిమెంట్‌కు గౌరవంగా ఒక బ్లాక్ ప్రజల సందర్శనకు
- టూరిజం అభివృద్ధితో పాటు ఆదాయ సృష్టిపై దృష్టి



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పదంగా నిర్మించిన రుషికొండ భవన సముదాయాన్ని (ప్యాలెస్) వందల కోట్ల ప్రజాధనం వృథా కాకుండా, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో అంతర్జాతీయ స్థాయి లగ్జరీ రిసార్ట్‌గా మార్చాలని, ప్రజల సందర్శనార్థం వినియోగించాలని ప్రాథమిక నిర్ణయించినట్లు మంత్రివర్గ ఉపసంఘం వెల్లడించింది. సుమారు రూ. 450 కోట్ల ప్రజాధనంతో, నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన ఈ రాజప్రాసాదాన్ని కూల్చివేయకుండా,

మిగతా 2లో...

# ఇంటింటా యోగా.. ఆరోగ్యాంధ్రే లక్ష్యం



- యోగా ద్వారా ఆరోగ్య విప్లవమే లక్ష్యమన్న చంద్రబాబు
- జూన్ 21న విజయవాడలో రాష్ట్రస్థాయి యోగా దినోత్సవం
- అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో, ఘనంగా నిర్వహించేలా

మిగతా 2లో...

# 2.20 లక్షల మందికి కొత్త వితంతు పింఛన్లు!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీలో కొత్త పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. త్వరలో కొత్తగా 2.20 లక్షల మందికి వితంతు పింఛన్లను మంజూరు చేయనున్నట్లు సెర్ప్, ఎన్ఆర్ఐ, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. రానున్న ఒకటి, రెండు నెలల్లో

మిగతా 2లో...

# వెన్నుపోటుకు పేటెంట్ జగన్‌దే..!

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇప్పుడు నీతులు చెబుతున్నాడు
- అబద్ధాలతో అధికారం... అరాచకాలతో గత ఐదేళ్లు పాలన
- తల్లి, చెల్లిని రాజకీయంగా వాడుకుని పక్కన పెట్టింది ఎవరు?
- రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టిన జగన్‌కు ప్రజలే గుణపాఠం చెప్పారు
- అప్పులు, అరాచకాలు, అబద్ధాల పాలనకు 2024లో ముగింపు పలికారు
- కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం వైసీపీ నైజం
- 2014లో రాష్ట్రాన్ని నిర్మించాం... 2019లో రాష్ట్రాన్ని నాశనం చేశారు

3 లో



# మంత్రి సత్యకుమార్ సంచలనం... 43 మంది వైద్యులు డిస్మిస్

- మరో 34 మంది రాజీనామాల సమర్పణ
- అనధికారికంగా విధులకు దూరంగా ఉన్న వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ వైద్య సేవలకు దూరంగా అనధికారికంగా విధులకు గైర్హాజరీలో ఉన్న 43 మంది వైద్యుల( సివిల్ అసిస్టెంట్ సర్జన్ )పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. గరిష్టంగా నాలుగేళ్ల నుంచి విధులకు రాకుండా ఉన్న వీరికి నిబంధనలు అనుసరించి సంజాయిషీ నోటీసుల జారీతోపాటు అభియోగాలు నమోదుచేసినప్పటికీ స్పందన లభించనందున విధుల నుంచి శాశ్వతంగా తప్పించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన జారీచేశారు. గతనెలలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని బోధనాసుపత్రుల్లో పనిచేసే వైద్యుల్లో 51 మంది అనధికారికంగా విధులకు దూరంగా ప్రభుత్వ నిబంధనలు అనుసరించి తప్పించారు. ఇదేవిధంగా ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోనూ జరిగేందుకు అవసరమైన చర్యలు తుదిదశకు చేరుకున్నాయి. వీరిలో జనరల్ మెడిసిన్,ఆర్థో, గైనిక్ ఇతర వైద్యులు ఉన్నారు

**మరో 34 మంది రాజీనామాల సమర్పణ:** వాస్తవానికి 118 మంది పర్మినెంట్ వైద్యులు అనధికారికంగా విధులకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడాదికి మించి అనధికారికంగా విధులకు దూరంగా ఉంటే విధుల నుచి తప్పించవచ్చు. వీరిపై ప్రభుత్వ నిబంధన అనుసరించి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే 43 మంది వైద్యులను శాశ్వతంగా విధుల నుంచి తప్పించే ప్రక్రియ మొదలైంది. ఈ 43 మంది కాకుండా మరో 34 మంది వైద్యులు సంజాయిషీ

మిగతా 2లో...



## మంగళగిరికి యూజీడీ వరం

(మొదటి పేజీ తరువాయి)

యూజీడీ నెట్ వర్క్ ఫేజ్–1లో 300కి.మీలు, ఫేజ్–2లో 231కి.మీలు కలిపి మొత్తం 531 కి.మీలు నిర్మించనున్నారు. మురుగు నీటిశుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ) ఫేజ్–1లో 7, ఫేజ్–2లో 13 కలిపి మొత్తం 20 నిర్మించనున్నారు. వీటిని మొత్తం 20 జోన్లుగా విభజించారు. 1 ఎంఎల్డీ (రోజుకు పది లక్షల లీటర్లు) కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ఎస్ బీఆర్(గ్రా–దీ=) సాంకేతికత ఆధారిత ఎస్టీపీలు 14కాగా, 1 ఎంఎల్డీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ఎఫ్‌బీ టెక్ ప్యాకేజ్డ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు 6 ఉండనున్నాయి. రోడ్ల పునరుద్ధరణతో కలిపి మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ. 1,167.50 కోట్లు కానుంది. మొదటి దశలో రూ. 604.32 కోట్లు, రెండో దశలో రూ. 563.18 కోట్లు వెచ్చించనున్నారు. ఎస్టీపీ సామర్థ్యం మొదటి దశలో 26.48 ఎంఎల్డీ, రెండో దశలో 21.03 ఎంఎల్డీ కలిపి మొత్తం 47.51 ఎంఎల్డీ కానుంది. లిఫ్ట్ స్టేషన్లు మొదటి దశలో 4, రెండో దశలో 14 కలిపి మొత్తం 18 నిర్మించనున్నారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, రూరల్ అధ్యక్షుడు దాసరి కృష్ణతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఫీల్డ్‌లోకి వెళ్లాల్సిందే..!

(మొదటి పేజీ తరువాయి)

వీటిల్లో 79 శాతం గుంతలను పూడ్చాం. మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలి. ముఖ్యంగా అర్బన్–రూరల్ కనెక్టివిటీ రోడ్లల్లో మరమ్మత్తులు త్వరగా చేపట్టాలి. అలాగే రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులకు సంబంధించి ఆర్ అండ్ బి మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలి."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**గవర్నెన్సుకు టెక్నాలజీ అనుసంధానం... కలిసి పని చేసేందుకు గూగుల్ అంగీకారం :** "డేటా డ్రివెన్ గవర్నెన్సులో గూగుల్ మనతో కలిసి పని చేయడానికి అంగీకరించింది. వాణిజ్య పన్నుల శాఖ ఇప్పటికే గూగుల్ తో కలిసి పని చేస్తోంది. ఆ దిశగా మిగిలిన శాఖల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పీజీఆర్ఎస్ లో ప్రజలిచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. ఈ మేరకు అర్జీదారులే స్వయంగా వారి అర్జీలను ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించాలి. తామిచ్చిన ఫిర్యాదు ఏ మేరకు పరిష్కారమవుతోందోననే అంశాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా ట్రాకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటా యోగా.. ఆరోగ్యాంధ్రే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 'యోగాంధ్ర--2026' ఏర్పాట్లపై ఈరోజు (బుధవారం) ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

**విజయవాడలో యోగా దినోత్సవం.. :** జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్టేడియంలో 5 వేల నుంచి 6 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి బాబా రాందేవ్ హాజరుకానున్నారని తెలిపారు. యోగాంధ్ర--2026లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

**ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలి.. :** యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

**20న యోగా కార్యక్రమంలో పాల్గొనున్న బాబా రాందేవ్.. :** ఈ నెల 20వ తేదీన ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో బాబా రాందేవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే యోగాంధ్రకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆరోగ్యంపై అందరూ ధ్యాస పెట్టేలా.... యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మార్గనిర్దేశం చేశారు. సంజీవని కార్యక్రమంతో అనుసంధానం ద్వారా యోగాను ఇంటింటికీ తీసుకువెళ్లాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## 2.20 లక్షల మందికి కొత్త వితంతు పింఛన్లు!




(మొదటి పేజీ తరువాయి)

అర్హులకు ప్రతి నెలా రూ. 4,000 చొప్పున ఆర్థిక సాయం అందించేలా మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

**పింఛన్ల పంపిణీలో ఏపీదే అగ్రస్థానం :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 62.34 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నామని, ఇందుకోసం ఏటా రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. దేశంలో అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని స్పష్టం చేశారు. పింఛను తీసుకునే భర్త మరణిస్తే, ఆ కుటుంబం ఇబ్బంది పడకుండా తక్షణమే భార్యకు 'స్పౌజ్ కేటగిరీ' కింద పింఛను బదిలీ చేస్తున్నామని, ఇలా ఇప్పటికే 2.45 లక్షల మందికి లబ్ధి చేకూర్చామని తెలిపారు.

**విపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదు :** పింఛన్ల తొలగింపుపై విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 9.56 లక్షల పింఛన్లను దారుణంగా తొలగిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిబంధనల మేరకు కేవలం 7,856 అనర్హుల పింఛన్లను మాత్రమే తొలగించిందన్నారు. దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలున్న వారి పింఛన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

## కాజ ఈస్ట్ లేక్ పార్క్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

- **రూ.3.3 కోట్ల వ్యయంతో పార్క్ నిర్మాణం**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)** : మంగళగిరి మండలం కాజ గ్రామంలోని ఉప్పలపాడు–నంబూరు–కాజ రోడ్డు మార్గంలో ఆధునిక హంగులతో నిర్మించిన కాజ ఈస్ట్ లేక్ పార్క్ ను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందుగా కాజ లేక్ పార్క్ కు చేరుకున్న మంత్రి లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్ లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కాజ ఈస్ట్ లేక్ పార్క్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. పార్క్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కను నాటారు. అనంతరం పార్క్ మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. సెల్ఫీ తీసుకున్నారు.

**రూ.3.3 కోట్ల వ్యయంతో పార్క్ నిర్మాణం :** మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన పర్యావరణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా కాజ గ్రామంలో ఈస్ట్ లేక్ పార్క్ ను నిర్మించారు. సెల్ కాన్ సంస్థ రూ. 3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఈ పార్క్‌ను అభివృద్ధి చేయడం జరిగింది. 17.18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఆధునిక హంగులతో పార్క్‌ను తీర్చిదిద్దారు. ఇప్పటికే ఉన్న చెరువు కట్టను 1.7 కిలోమీటర్ల మేర బలోపేతం చేశారు. పార్క్‌లో 42 రకాల జాతులకు చెందిన మొత్తం 12,800 మొక్కలను నాటారు. 1.7 కిలోమీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు.

అదేవిధంగా ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, భద్రత కోసం ట్రాక్ కు ఇరువైపులా జీఐ చైన్– లింక్ మెష్ ఫెన్సింగ్, ఆధునిక సుందరీకరణ పనులు చేపట్టి పార్క్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాకింక్ ట్రాక్ వెంట విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, మంగళగిరి ఏఎంసీ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చందు, ఏపీ సివిల్ సప్లైస్ కార్పోరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్యతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు.

## ఓటరే ప్రజాస్వామ్య బలం



(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కొత్త ఓటరుగా నమోదు, పేరు, చిరునామా, వయస్సు వంటి వివరాల మార్పులు, ఇతర నియోజకవర్గానికి మారినప్పుడు ఓటరు బదిలీ వంటి సేవలు పొందవచ్చని తెలిపారు. అవసరమైన పత్రాలుగా ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం లేదా వయస్సు రుజువు, నివాస ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు తదితరాలు అవసరమవుతాయని చెప్పారు.

ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై ప్రజలు అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలన అనంతరం తుది ఓటరు జాబితా విడుదల అవుతుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఈ సమావేశంలో టౌన్ ప్రెసిడెంట్ మహమ్మద్ కుద్దూస్, అశోకవర్ధన, జొన్నల మహేష్, కేసన కోటేశ్వరరావు, కంచర్ల ఏడుకొండలు, విజయ్ కుమార్, రమ్య, మధు కోనేరు, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్ సంచలనం ... 43 మంది వైద్యుల డిస్మిస్




(మొదటి పేజీ తరువాయి)

నోటీసులు జారీ, అభియోగాల నమోదు అనంతరం రాజీనామాలు చేశారు. వీరిలో 15 మంది రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించబోతుంది. అభియోగాల నమోదు అనంతరం మిగిలిన 19 మంది రాజీనామాలు చేసినందున క్రమశిక్షణ (సీసీఏ రూల్సు–1991) చర్యల్లో భాగంగా జిల్లాల వారీగా 11 మంది విచారణ అధికారులను నియమించారు. వీరి సదరు వైద్యుల నుంచి వివరణ కోరి, ఇచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబ వెల్లడించారు. అభియోగాల నమోదు అ–నశీతరం మరో 19 మంది వైద్యులు వ్యక్తిగత కారణాలవల్ల విధులకు హాజరుకాలేదని వివరణ ఇచ్చారు. దీనిపై విచారణ జరగనుంది. సంజాయిషీల నోటీసులు జారీ జరిగిన తర్వాత 9 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు విధుల్లో చేరారు. మరో 13 మంది వైద్యుల అభ్యర్థనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

## అభిమాని కోసం అడుగులు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం.

నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను.

అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను" అని పేర్కొన్నారు.



**క్యాంటీన్ పెట్టుకోండి.. సాయం చేస్తా: పవన్ హామీ**

ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రుల వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

## డబుల్ ఇంజిన్ పాలనలో 'అభివృద్ధికి వేగం.. సంక్షేమానికి భరోసా'

- **మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ 12 ఏళ్ల పాలన, రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల "నమ్మకం -- అభివృద్ధి - సంక్షేమం" ప్రగతి నివేదిక సభలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల నిర్లక్ష్యానికి స్వస్తి పలికి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైల్వే బడ్జెట్ రూ. 860 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ. 10,600 కోట్లకు పెరిగిందని, దీని ఫలితంగా విజయవాడ జంక్షన్ ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.






పేదల సొంతింటి కలను నిజం చేసే లక్ష్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 25 లక్షల పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు రూ. 1,200 కోట్లతో 4,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో గత రెండేళ్లలో 3,950 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటై, వాటి ద్వారా 19 వేల మందికి పైగా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభించాయని మంత్రి వెల్లడించారు.

"సూపర్ సిక్స్" పథకాలపై మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఏటా రూ. 20 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నామని, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ. 10 వేల చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకు పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. వృద్ధుల పెన్షన్‌ను రూ. 4 వేలకు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 6 వేలకు పెంచామని పేర్కొన్నారు.

మహిళల కోసం దీపం పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం, పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.

ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## రుషికొండ ప్యాలెస్‌కు పునర్వైభవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేలా 'హాస్పిటాలిటీ' రంగానికి కేటాయించడమే సముచితమైన మార్గమని కమిటీ అభిప్రాయపడింది. వైజాగ్ వాసుల సెంటిమెంట్‌ను గౌరవిస్తూ ప్రజల సందర్శనార్థం ఒక బ్లాక్‌ను కల్చరల్ లేదా హెరిటేజ్ సెంటర్‌గా ఉంచేలా రూపొందించిన ఈ నివేదికను అంతిమ నిర్ణయం కోసం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే కేబినెట్ ముందుకు త్వరలోనే తీసుకెళ్లనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది.

వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నంలోని రుషికొండ భవనాల (ప్యాలెస్) వినియోగం మరియు తదుపరి కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిలతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం భవన సముదాయాన్ని స్వయంగా సందర్శించింది. ఈ పరిశీలనలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పర్యాటక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్రుల బృందం ప్యాలెస్‌లోని ప్రతి బ్లాక్‌ను, ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. భవనాల లోపల అమర్చిన ఖరీదైన టైల్స్, బెడ్స్, ఫర్నీచర్, బాత్ టబ్స్, కమోడ్స్ వంటి అంతర్గత వసతులను, నిర్మాణ శైలిని పరిశీలించింది. అనంతరం భవనాలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలిస్తూ ఒక్కో బ్లాక్ రూపకల్పన, వాటి ప్రస్తుత స్థితిగతులను పర్యాటక శాఖ ఇంజినీర్ అధికారులను, రెవెన్యూ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా రుషికొండ ప్యాలెస్‌తో పాటు, ఆ పరిసర ప్రాంతాల్లో మరియు బీచ్ రోడ్డుకు ఆనుకుని అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను కూడా కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా భవనాల భవిష్యత్తు వినియోగంపై విశాఖపట్నంలోని యాత్రినివాస్ లో మంత్రుల బృందం పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులతో కలిసి సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రుల బృందం మాట్లాడుతూలి.. భవనాల భవిష్యత్తు వినియోగంపై ప్రజల ప్రయోజనాలు, ప్రభుత్వ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిపింది. ఇప్పటికే ప్రఖ్యాత సంస్థలతో చర్చించామని, ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరించామని పేర్కొన్నారు. ప్రజల నుండి పిచ్చాసుపత్రి, మ్యూజియం, ప్లానిటోరియం, కల్చరల్ హెరిటేజ్ సెంటర్, స్టేట్ గెస్ట్ హౌస్‌గా మార్చాలని, కొందరు కూల్చివేయాలని కూడా విభిన్న అభిప్రాయాలు వచ్చాయన్నారు. ప్రజాధనం ఎలా వృథా చేశారో చూపించడానికి టికెట్ పెట్టి ప్రజలను, స్కూల్ పిల్లలను సందర్శనకు అనుమతించాలని కొందరు కోరారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు బాధ్యతగా ఆలోచించారని పేర్కొన్నారు. ఈ ప్రాపర్టీ మినిమం మెయింటెనెన్స్‌కే నెలకు రూ. 25 లక్షలు, దాని లావిష్‌నెస్‌ను అలాగే మెయింటెన్ చేయాలంటే దాదాపు రూ. 1.5 కోట్లు అవుతుందని తెలిపారు. కాబట్టి మెజార్టీ అభిప్రాయం మేరకు దీనిని 'రిసార్ట్' (హాస్పిటాలిటీ) గా కొనసాగించడమే సముచితమని జీఓఎం భావిస్తోందన్నారు.

ఈ ప్యాలెస్‌ను అంతర్జాతీయ స్థాయి రిసార్ట్‌గా మార్చే క్రమంలో ఇప్పటికే తాజ్, టాటా, ఫెమా, లీలా, ఎట్మోస్ఫియర్ కోర్ వంటి పలు దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపించాయని మంత్రులు వెల్లడించారు. అయితే రుషికొండ కింద ఉన్న భూమి కూడా ఇస్తే కలిపి డెవలప్ చేస్తామని అడిగారన్నారు. త్వరలోనే అధికారిక నోటిఫికేషన్ ఇచ్చి, ఆసక్తి గల సంస్థలను ఆహ్వానిస్తామన్నారు. నిబంధనల ప్రకారం ఎలిజిబులిటీస్, రిక్వెస్ట్ ఫర్ క్వాలిఫికేషన్ (=ఖీు) పరిశీలించి, మినిమం క్వాలిఫికేషన్స్ మరియు టైమ్ ఫ్రేమ్ పెట్టి కేటాయిస్తామన్నారు.



మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులు మాత్రమే చేస్తుందిని, తాము నిర్ణేతలం కాదని, ఈ ప్రతిపాదనలను సీఎంకు వివరించి కేబినెట్ ద్వారా అంతిమ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. సంస్థలకు తమ అభిప్రాయాన్ని చెప్పి 10–15 రోజుల్లో సమగ్ర డీపీఆర్‌లతో రమ్మని కోరతామన్నారు. రుషికొండ వైజాగ్ వాసులకు ఎంతో అనుబంధం ఉన్న ప్రాంతం కాబట్టి, ప్రైవేట్ సంస్థలకు ఇచ్చినా ఒక బ్లాక్‌ను కల్చర్ లేదా హెరిటేజ్ సెంటర్‌గా మార్చి ప్రజల సందర్శనార్థం ఉంచాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూలి.. "వివిధ దశల్లో దాదాపు రూ. 450 కోట్ల ప్రజాధనంతో ఈ ప్యాలెస్ నిర్మాణం జరిగింది. ఈ భవనంలో కేవలం ఒక బాత్‌రూమ్ సైజే 21/21 ఫీట్లు (450 చదరపు అడుగులు) ఉంది. గత ప్రభుత్వ అధినేత సామాన్యుడికి ఒక సెంట్ స్థలంలో 270 చదరపు అడుగుల ఇల్లు ఇస్తామని చెప్పి, తన బాత్‌రూమ్ కోసం ఇద్దరు సామాన్యులు ఉండే సైజులో కట్టించుకోవడం దుర్మార్గం. జగన్ మోహన్ రెడ్డి తన సొంత డబ్బులతో ప్రైవేట్‌గా కట్టుకుంటే మాకేం అభ్యంతరం లేదు, కానీ ప్రజాధనంతో ఇంత విలాసమా? ఎంట్రీలో మార్బుల్ డిజైన్స్ కోసం చదరపు అడుగుకు రూ. 6,450 ఖర్చు చేశారు. బాత్‌రూమ్ ధర అక్షరాలా రూ. 12 లక్షలకు పైమాటే, అందులోని కమోడ్ విలువ రూ. 4–5 లక్షలు ఉంటుంది. ఎన్నో స్టార్ హోటళ్లు చూశాను కానీ ఈ స్థాయి విలాసాలు ఎక్కడా చూడలేదు. హరిత రిసార్ట్ స్థానంలో కడుతున్నట్లు కోర్టులకు తప్పుడు పత్రాలు సమర్పించి తప్పుదోవ పట్టించారు. భవన నిర్మాణంలో భారీ డీవియేషన్స్ ఉన్నాయని, వేరే చోట కట్టారని కమిటీ నివేదికలో స్పష్టంగా ఉంది. దురదృష్టవశాత్తు ఆ కమిటీ రిపోర్ట్ సబ్మిట్ చేసే నాటికి ఛైర్మన్ చనిపోయారు. బెటర్ ఐడియాలతో ఎవరైనా వస్తే సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాం. గత ప్రభుత్వంలా నిబంధనలు ఉల్లంఘించే ఆలోచన మాకు లేదు. వృథా అయిన ప్రజాధనాన్ని ఎలా రికవరీ చేసుకోవాలో ప్రభుత్వం ఆలోచిస్తుంది. రుషికొండ కాంట్రాక్టర్‌కు జరిగింది రుషికొండ పనుల చెల్లింపులు కాదు, అవి ఆ కాంట్రాక్టర్ చేసిన వేరే ఇతర పనుల చెల్లింపులని గమనించాలి. తప్పులను ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించదు." అన్నారు.

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూలి.."గత ప్రభుత్వం 58 గదులున్న హరిత రిసార్ట్స్‌ను కూల్చివేసే నాటికి దాని ద్వారా ఏపీటీడీసీ కి ఏడాదికి రూ. 7.5 కోట్ల ఆదాయం వచ్చేది. దానిని పడగొట్టడం వల్ల డిపార్ట్‌మెంట్ తీవ్రంగా నష్టపోయింది. చివరకు బ్యాంక్ లోన్‌లకు వెళ్లి నిర్వహణకు డబ్బులు తెచ్చుకునే పరిస్థితి తెచ్చారు. జీవోలో 'రీడెవలప్‌మెంట్' అని పేర్కొని, నిబంధనలు అతిక్రమించి రాజప్రాసాదాన్ని నిర్మించుకున్నారు.

సమావేశంలో పర్యాటక శాఖ ఈఈ ఈశ్వరయ్య, ఈడీ శేషగిరి రావు, సీఆర్ జెడ్ అధికారులు, భీమిలీ ఆర్డీవో, డీవీఎం జగదీష్, డీటీవో కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంతృప్తే కూటమి ప్రభుత్వానికి గీటురాయి



రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా "విద్య"ను ప్రధాన అంశంగా కేటాయించి రాజమహేంద్రవరంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతి, లబ్ధిదారుల జీవితాల్లో వచ్చిన మార్పులను ప్రజలకు, నాయకులకు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, పారదర్శక పాలన, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన తదితర రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తోందన్నారు. విద్యారంగంలో సాధించిన పురోగతి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల విశేషాలను ప్రతిబింబించే స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో రాక్షస పాలన సాగిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు ఒక మంచి సుపరిపాలన అందుతోందని చెప్పుకొచ్చారు. గత సర్కారు అసమర్థ నిర్వాకాలు.. నేటి ప్రభుత్వం సాధిస్తున్న అద్భుత ఫలితాల వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతిఒక్క హామీని అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని.. లబ్ధిదారుల ముఖాల్లో ఆ ఆనందం స్పష్టంగా కనిపిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఊహించిన దాని కంటే.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి రెండేళ్లలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపినట్లు తెలిపారు. ముఖ్యంగా దేశంలోనే ఓ విజనరీ ముఖ్యమంత్రిగా పేరుపొందిన నారా చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో ఈ విభజిత ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళుతోందని చెప్పుకొచ్చారు. ఓవైపు చంద్రబాబు గారి దార్శనికత, మరోవైపు పేదల కోసం పరితపించే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్., ఇంకోవైపు కేంద్రం నుంచి సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు కితాబిచ్చారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, పింఛన్ల పంపిణీ, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు ఇలా రెండేళ్లలో 20 ఏళ్లకు సరిపడా సంక్షేమాభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపామన్నారు. అదేవిధంగా విద్యా ఐటీ శాఖ మంత్రిగా నారా లోకేష్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు అనేకమని మంత్రి దుర్గేష్ అన్నారు. గతంలో పదవ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వం యూనిఫాం అందించేదని.. కానీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా యూనిఫాం, సకల సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లోనూ శాస్త్ర సాంకేతిక, ఆవిష్కరణ నైపుణ్యాలను పెంపొందించేలా కృత్రిమ మేధ(ఏఐ) పాఠ్యాంశాలు వంటివి చేర్చడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థుల నైపుణ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించడం వంటి అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ డీఎస్సీ గూర్చి ఆలోచన చేయలేదని.. ఈ ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీ ప్రకటించి, 16,393 టీచర్ పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. ఇలా పేదలు, విద్యార్థులు, రైతులు, మహిళలు అన్ని వర్గాల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. 2029 నాటికి పేద యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఓ కమిటీని ఏర్పాటు చేయగా.. అందులో తాను ఓ సభ్యుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో నూటికి నూరు శాతం సఫలీకృతమవుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇటువంటి అద్భుత కార్యక్రమాలు చేపడుతున్న కూటమి ప్రభుత్వం పదికాలాల పాటు చల్లగా ఉండేలా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

# రుణం చెల్లింపులో కృష్ణా మిల్క్ యూనియన్ సరికొత్త రికార్డు

- చైర్మన్ చలసాని ఆంజనేయులు

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : రుణం చెల్లింపుల్లో కృష్ణా మిల్క్ యూనియన్ సరికొత్త రికార్డు సృష్టించిందని ఆ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు వెల్లడించారు. కృష్ణాజిల్లా వీరవల్లి ప్లాంట్ నిర్మాణం కోసం తీసుకున్న రూ.110 కోట్ల బ్యాంకు రుణం కేవలం రెండున్నర ఏళ్లలో యూనియన్ చెల్లించిందని చెప్పారు. ఇది సరికొత్త రికార్డు అని తెలిపారు. బుధవారం విజయవాడలోని మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో కార్మికులు, ఉద్యోగులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ చైర్మన్ మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారుల చిరకాల స్వప్నమైన ప్రాజెక్ట్ కామధేను విజయవంతంగా సాకారమైందని పేర్కొన్నారు.

వీరవల్లి గ్రామంలో రోజుకు 6 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ సామర్థ్యంతో పని చేస్తోందని యూనియన్ చైర్మన్ చెప్పారు. భవిష్యత్తులో 8 లక్షల లీటర్లకు విస్తరించే వీలుందన్నారు. అందుకోసం అత్యాధునికమైన పూర్తి ఆటోమేషన్ ప్లాంట్‌ను రూ.185 కోట్ల అంచనాతో ప్రారంభించామని వివరించారు. కేవలం రూ.163 కోట్ల వ్యయంతో దీనిని పూర్తి చేయడం ఈ యూనియన్‌కు గర్వకారణమని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.110 కోట్ల బ్యాంకు రుణాన్ని 7 సంవత్సరాల కాలపరిమితితో తీసుకున్నామని గుర్తు చేశారు.

కానీ పాడి రైతుల సహకారంతో కేవలం రెండున్నర ఏళ్లలోనే ఈ రుణం పూర్తిగా చెల్లించడం అసాధారణ విజయమని చలసాని ఆంజనేయులు అభివర్ణించారు. ఈ పాల కేంద్రానికి మ్యాక్స్ చట్ట రూపకర్త నందమూరి తారక రామారావు ప్లాంట్‌గా నామకరణం చేశామని తెలిపారు. ఈ ప్లాంట్‌ను కృష్ణా జిల్లా రైతాంగానికి, భవిష్యత్తు తరాలకు అంకితం ఇస్తున్నట్లు చైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు.



# అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతాం

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్‌ను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తా
- పులివెందుల ఎమ్మెల్యే ఏపీలో నివసిస్తే రెండేళ్లలో ఏం చేశామో తెలుస్తుంది
- ఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదు
- గొడ్డలి బ్యాచ్ కు మహిళలను గౌరవించడం తెలియదు
- జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరు
- డీఎస్సీపై ఎప్పుడైనా చర్చకు సిద్ధం
- మంగళగిరిలో విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్



తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 2019లో 5,300 ఓట్ల తేడాతో మంగళగిరిలో నేను ఓడిపోయాను. మొదటి రోజు బాధ, ఆవేదన కలిగింది. రెండో రోజు ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఊరూరా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నా. 2024 ఎన్నికల్లో 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే కొండంత బలం వస్తుందని చెప్పాను. నా కోరికను మన్నించి రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీతో గెలిపించారు. నాపై ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. గెలిచిన మొదటిరోజు నుంచే మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ పవర్ మొత్తం మంగళగిరి నియోజకవర్గానికి ఏర్పాటుచేస్తున్నాం. దుగ్గిరాలలో అన్న క్యాంటీన్ ప్రారంభించాం. లైబ్రరీలకు పూర్వవైభవం తీసుకువస్తున్నాం. మంగళగిరి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. పార్క్ లు, లేక్ లు, కమ్యూనిటీ భవనాలు, చివరకు శ్మశానాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం.

**అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతాం** : రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. మంగళగిరికి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను తీసుకువచ్చాం. ఎంపీ పెమ్మసాని గారు కేంద్రంతో మాట్లాడి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మంగళగిరికి మంజూరు చేయించారు. ఇది మంగళగిరి ప్రజల అదృష్టం. మంగళగిరి నియోజకవర్గ వాసిగా ఈ ప్రాజెక్ట్ ను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తా. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించాను. అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గం నెం.1గా ఉండాలనేది లక్ష్యం. ఇందుకోసం అహర్నిశలు కష్టపడతా. రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు మోడల్ గా మంగళగిరిని రూపొందిస్తాం. మిగతా నియోజకవర్గాల్లో కూడా దశలవారీగా చేపడతాం.

**పులివెందుల ఎమ్మెల్యే ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయి** : ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వృద్ధులకు రూ.4వేల పెన్షన్, వికలాంగులకు రూ.6వేలు, ప్రతిఏడాది ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉన్నా ఆర్థికసాయం అందిస్తున్నాం. మత్స్యకార సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, అన్నదాత సుఖీభవ కింద కేంద్రం, రాష్ట్రం కలిసి రూ.20వేలు అందిస్తున్నాం. ఇచ్చిన హామీలు పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. పులివెందుల ఎమ్మెల్యే బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయి. బెంగళూరులో మూడు రోజులు, తాడేపల్లిలో ఒకరోజు, హైదరాబాద్ లో మూడు రోజులు ఆయన నివసిస్తారు. అందుకే ఆయన బెంతాహై.

**ఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదు** : ఎవరి ఓట్లు తీయాల్సిన అవసరం మాకు లేదు. ఓటు నమోదు పకడ్బందీగా చేయాలనేది మా లక్ష్యం. కావాలనే మాపై ఆరోపణలు చేస్తున్నారు. పబ్లిక్ లో ఉన్న డేటానే మా వద్ద కూడా ఉంది. వైసీపీకి ఐటీలో అవగాహన లేదుకాబట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారు. ఒక యాప్ తయారుచేసి మా కార్యకర్తలకు సులభతరం చేశాం. విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉంటుంది. ప్రిజనరీ ఎప్పుడూ జైలు వైపు చూస్తాడు. ఆయన చుట్టూ ఎప్పుడూ రౌడీలు ఉంటారు. మహిళలను కించపరిచే వారు ఉంటారు. విజనరీ ఎప్పుడూ ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయి. ఇందుకు బ్రాండ్ సీబీఎన్ కారణం. 76 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు గారు ఆయనే కొబ్బరికాయ తీసుకుని కొడతారు. సైకిల్ తొక్కుతారు. పులివెందుల ఎమ్మెల్యే అదికూడా చేయలేరు.

**గొడ్డలి బ్యాచ్ కు మహిళలను గౌరవించడం తెలియదు** : ఇండస్ట్రీకి, కోడిగుడ్డుకు తేడా తెలియని వ్యక్తి ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ తీసుకురాలేదు. ఉన్న పరిశ్రమలు తరిమేశారు. హోంమంత్రి అనితపై కోడిగుడ్డు మంత్రిగా పనిచేసిన వ్యక్తి కించపరిచేలా మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు చాలా బాధాకరం. గుడివాడ అమర్ నాథ్ ను చాలా బాగా చేశావని జగన్‌రెడ్డి పొగిడారంట. అసలు వీరు ఎక్కడికి పోతున్నారు? ఇదేవిధంగా భారతిరెడ్డి గారి గురించి, మీ ఇద్దరు కూతుళ్ల గురించి మాట్లాడితే సమర్థిస్తారా? ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం? అధికారంలో ఉన్నప్పుడు మా తల్లిని అవమానించారు. బ్రాహ్మణిని అవమానించారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మా కార్యకర్త పొరపాటున భారతిరెడ్డి గారి గురించి మాట్లాడితే.. క్షమాపణే కాదు.. అతడిని జ్యుడిషియల్ రిమాండ్ కు పంపిన ఘనత ప్రజాప్రభుత్వానిది. అదీ మహిళల పట్ల మా గౌరవానికి నిదర్శనం. గొడ్డలి బ్యాచ్ కు మహిళలను గౌరవంచడం తెలియదు. జగన్ లో జీ అంటే గొడ్డలి.

**జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరు** : జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరు. మేం డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించాం. హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ ను అధ్యయనం చేసి కచ్చితమైన నోటిఫికేన్ ఇచ్చాం. దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా మేం నోటిఫికేషన్ ఇచ్చాం. 150 రోజుల్లో 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. మళ్లీ టెట్ పరీక్ష జరుగుతుంది. డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. మళ్లీ టీచర్ ఉద్యోగాలు భర్తీ చేస్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. సాక్షి కేలండర్ కాదు.. పదివేల పోస్టులతో జాబ్ కేలండర్ ఇచ్చాం. మొదటిసారి హారిజాంటల్ రిజర్వేషన్ అమలుచేశాం. దీనిగురించి తెలుసుకోవాల్సిన బాధ్యత యువతపై ఉంది. హారిజాంటల్ రిజర్వేషన్ పాటించకపోతే సబర్వాల్ జడ్జిమెంట్ అనేది ఉంది. ఆ జడ్జిమెంట్ ను అడ్డం పెట్టుకుని వైసీపీనే కోర్టులో వేసి స్టే తీసుకువస్తారు. వైసీపీ నాయకులే డీఎస్సీపై 240 కేసులు వేశారు.

**డీఎస్సీపై ఎప్పుడైనా చర్చకు సిద్ధం** : ఐదేళ్లలో జగన్ రెడ్డి ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే హారిజాంటల్ రిజర్వేషన్ అంటే ఏమిటో అర్థమై ఉండేది. మీరు ముందు సబ్జెక్ట్ తెలుసుకోవాలి. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ కులం కార్డు కూడా తీసుకువచ్చారు. దౌర్భాగ్యం ఏంటంటే 2014-19 మధ్య కూడా డీఎస్సీ ప్రమోషన్లలో ఒకే సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారని దుష్ప్రచారం చేశారు. ప్రజలు కూడా నమ్మారు. తర్వాత వాస్తవాలు బహిర్గతం అయ్యాయి. ఇప్పుడు కూడా పనికిమాలిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని ముందుపెట్టుకుని స్పోర్ట్స్ కోటాలో ఒకే సామాజికవర్గం వారికి ఉద్యోగాలు ఇచ్చారని దుష్ప్రచారం చేస్తున్నారు. మేం వాస్తవాలు బహిర్గతం చేశాం. సదరు వ్యక్తి కమాపణలు చెప్పాలి కదా. బురదజల్లి పారిపోతున్నారు. జగన్ రెడ్డి ఇంటికి 200 మీటర్ల దూరంలోనే ఉన్నా. ఎప్పుడైనా చర్చకు సిద్ధమే. మా సమాధానాలపై జగన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేస్తున్నా.

**18 నెలల్లో నిడమర్రు ఆర్వోబీ నిర్మాణం పూర్తిచేయాలి** : నిడమర్రు ఆర్వోబీ నిర్మాణం 25 ఏళ్ల కల. కేంద్రంతో సంప్రదింపులు జరిపి వచ్చే 20 ఏళ్ల ట్రాఫిక్ ను పరిగణనలోకి తీసుకుని బ్రిడ్జిని నిర్మించుకోవడం జరుగుతుంది. 18 నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించాం. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టడం జరుగుతోంది. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మిస్తున్నాం. ఇందుకు సుమారు రూ.1,200 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మంగళగిరి పెద్దఎత్తున అభివృద్ధి చెందుతోంది. తాగునీటి ప్రాజెక్ట్ పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. కేంద్ర మంత్రులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ మంగళగిరి పనులు పూర్తిచేస్తున్నాం. అండర్ గ్రౌండ్ పవర్ తో పాటు అండర్ గ్రౌండ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ గ్యాస్ కూడా ప్రతి ఇంటికి అందిస్తాం. నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తాం. ఒక మోడల్ గా మహాప్రస్థానం ఏర్పాటుచేశాం. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. గత పాలకులు వెస్ట్ బైపాస్ ను సరిగా డిజైన్ చేయలేదు. ఒక్క ఎగ్జిట్ కూడా రాజధానికి ఉండకూడదనే దుర్బుద్ధితో వ్యవహరించారు. జగన్ కు అమరావతిపై కక్ష ఉంది. అవసరమైన మేరకు తాము ఎగ్జిట్ లు ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు.

# వెన్నుపోటుకు పేటెంట్ జగన్‌దే..!

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర రాజకీయాల్లో వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. వెన్నుపోటుకు కర్త, కర్మ, క్రియ జగన్‌నేనని, ఆ పదానికి పేటెంట్ హక్కులు ఎవరైనా ఇవ్వాలంటే అది జగన్‌కే ఇవ్వాలని ఎద్దేవా చేశారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని కోరుతున్నాను. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆంధ్రప్రదేశ్ తీవ్ర సంక్షోభంలో పడింది. రాజధాని లేదు, ఆదాయం లేదు, పరిశ్రమలు లేవు, ఉద్యోగ అవకాశాలు లేవు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల సమర్థ నాయకుడు కావాలని ప్రజలు భావించి తెలుగుదేశం పార్టీకి అవకాశం ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్ర పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఐదేళ్లలో ప్రజలు ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు కృషి చేశాం. అయితే 2019లో అబద్ధాలు, అసత్యాలు, సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి జగన్ అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కినెట్టారు. మాట్లాడే స్వేచ్ఛ లేకుండా చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టారు. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై దమనకాండ సాగించారని తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి లక్షల కోట్ల అప్పులు చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా దివాళా అంచుకు చేర్చారు ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, మార్కెట్లు, వివిధ ఆదాయ వనరులను తాకట్టు పెట్టి భారీ స్థాయిలో అప్పులు తెచ్చింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టింది. మద్యం ఆదాయాన్ని కూడా భవిష్యత్ తరాలకు భారం అయ్యేలా ఉపయోగించారు. అభివృద్ధి లేకుండా, ఆదాయ సృష్టి లేకుండా అప్పులపై ఆధారపడిన పాలన సాగింది.

వైసీపీ అరాచక పాలనను చూసిన ప్రజలు మళ్లీ చంద్రబాబు నాయుడు నాయకత్వాన్నే కోరుకున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమికి ఘన విజయాన్ని అందించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ





సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి బాటలో పయనిస్తోంది. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ మరోసారి అబద్ధాలు, ఆరోపణలు, విద్వేష రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

ఈ రోజు "వెన్నుపోటు" పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ముందుగా తన రాజకీయ చరిత్రను చూసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ కుటుంబం అండతో ఆయన కుటుంబానికి రాజకీయ గుర్తింపు వచ్చింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకుని రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి లక్షకోట్ల అక్రమాస్తులు సంపాదించి, జైలుకు వెళ్లిన వ్యక్తి జగన్. తండ్రి మరణించిన సమయంలోనే ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాల సేకరణ జరిపించడం రాజకీయ చరిత్రలో ఎప్పటికీ మచ్చగా మిగిలిపోతుంది. పదవి రాలేదని కాంగ్రెస్‌ను వీడి కొత్త పార్టీ పెట్టడం వెన్నుపోటు కాదా? జైలులో ఉన్న సమయంలో తల్లి, చెల్లెలు పార్టీ కోసం కష్టపడితే, అధికారంలోకి వచ్చిన తర్వాత వారినే దూరం పెట్టడం వెన్నుపోటు కాదా? ఈ ప్రశ్నలకు ముందు సమాధానం చెప్పాలి. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్ ఈ రోజు యువత గురించి మాట్లాడటం హాస్యాస్పదం. సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. సంపూర్ణ మద్యనిషేధం తీసుకొస్తామని చెప్పి మాట తప్పారు. ఉద్యోగాలు, సంక్షేమం, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం ప్రతి అంశంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని వ్యక్తికి మ్యానిఫెస్టో గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. ప్రజలను మోసం చేసినందుకు జగన్ రాష్ట్రప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి. ఏదైనా అక్రమం జరిగి ఉంటే ఆధారాలతో ముందుకు రావాలని మంత్రి నారా లోకేష్ బహిరంగంగా సవాలు విసిరారు. ధైర్యం ఉంటే చర్చకు రావాలి. అధికారిక వివరాలు బయటకు వచ్చిన తర్వాత వైసీపీ ఆరోపణల్లో నిజం లేదని స్పష్టమైంది. సంవత్సరం క్రితం జరిగిన ప్రక్రియపై ఇప్పుడు అకస్మాత్తుగా ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ కుట్ర మాత్రమే ఉంది. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. 2019లో అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేసిన విధానాన్నే మళ్లీ అమలు చేయాలని చూస్తున్నారు. అయితే ఈసారి ప్రజలు ఆ మోసాలకు అవకాశం ఇవ్వరు. వైసీపీ రాజకీయాల మూల సిద్ధాంతం ప్రజలను విభజించడం. మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే దానికి కులరంగు పులిమి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రతి అంశంపై బాధ్యతాయుతంగా స్పందిస్తోంది. ఆరోపణలు వచ్చిన వెంటనే విచారణలు జరిపి నిజానిజాలు బయటపెడుతోంది. రాష్ట్రంలో శాంతి, భద్రత, సామాజిక సామరస్య పరిరక్షణకు కట్టుబడి ఉంది.

మత్స్య, ఆక్వారంగాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. విద్యుత్ ఛార్జీల తగ్గింపు, రైతులకు ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల కల్పన, అదనపు ఆర్థిక సహాయం వంటి చర్యలతో ఆక్వా రంగాన్ని లాభదాయకంగా మార్చింది. ప్రపంచ పరిస్థితులు, యుద్ధాల ప్రభావంతో కొన్ని ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తోంది. ఫీడ్ ధరలు, ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ పరిస్థితులపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. రైతులకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం ఒక్క నిర్ణయం కూడా తీసుకోదు. హోం మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకులు చేసిన వ్యక్తిగత, అవమానకర వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరం. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి గానీ వ్యక్తిగతంగా, మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదు. ఈ వ్యాఖ్యలపై సంబంధిత నాయకులు, జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర మహిళలకు మరియు హోం మంత్రికి క్షమాపణ చెప్పాలి.

# ఎల్‌నినో సమస్యను అధిగమించేలా పంటల సాగు విధానం



- ప్రకృతి సేద్యాన్ని మరింత విస్తరించేలా కార్యాచరణ
- డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగుకు ప్రణాళికలు
- వ్యవసాయ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఎల్‌నినో కారణంగా ప్రత్యేక వాతావరణ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలో పంటల సాగు విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పంటల మార్పిడికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు ఇవ్వాలని సీఎం నిర్దేశించారు. రాష్ట్రంలోని రైతులు పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో సర్టిఫికేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారని.. ఈ విషయాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. రైతులను చైతన్య పరిచే కార్యక్రమాల్లో తాను కూడా పాల్గొంటానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శాస్త్రీయ విధానంలో పంటలు సాగును తెలియచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి ఉత్పత్తులకు సంబంధించిన అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. పొగాకు కొనుగోలుదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గిట్టుబాటు ధర వచ్చే వరకూ నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న పప్పు దినుసులు సాగు చేసేందుకు వీలుగా ప్రణాళికలు చేయాలని.. తద్వారా రైతులకు ప్రయోజనం కలిగించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. మార్కెట్‌లో ఉన్న ఉత్పత్తులతో పాటు ప్రస్తుతం సాగు దశలో ఉన్న పంటల్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయం, ఉద్యాన పంటల విషయంలో అదనపు విలువ జోడించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆక్వా రైతులు, అసోసియేషన్లతో పాటు ఆక్వా ఫీడ్ తయారీదారులతోనూ సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కష్ట కాలంలో ఉన్న రైతులను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# గాదె సాయికృష్ణ అదృశ్యంపై సీఐ నాగరాజు సస్పెన్షన్

- సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు ఆదేశం
- ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- సమీక్షలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యవహారంలో సంబంధిత పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సచివాలయంలో సీఎం చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. సింగపూర్ పర్యటన ముగించుకుని సచివాలయానికి వచ్చిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. సాయికృష్ణ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశాలు ఇచ్చారు. దీనిపై సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తు చేయాలని సీఎం స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు చేశారు. ఈ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు తదితరులు హాజరయ్యారు.

# జూన్ 19 వ తేదీ న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు



**నంద్యాల, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 వ తేదీ, శుక్ర వారం ఉదయం 9 గంటల నుండి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియం లో నంద్యాల జిల్లా స్థాయి అమెచ్యూర్ చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ అధ్యక్షులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్సైట్లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి చదరంగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు .ఎంట్రీలు నమోదు చేసుకోవడానికి,ఇతర వివరాలకు క్రింది నెంబర్ 90104515 85 సంప్రదించాలని అన్నారు.

# 7.8 లక్షల విలువ చేసే ఎరువులు సీజ్



**నంద్యాల, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల మండలము నందు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ మరియు వ్యవసాయ శాఖ ల ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విజిలెన్స్ వ్యవసాయ అధికారి విశ్వనాథ్, మరియు మండల వ్యవసాయ అధికారి, నంద్యాల ప్రసాద్ రావు, విజిలెన్స్ SI వెంకట ప్రసాద్ ల ఆధ్వర్యంలో నంద్యాల లోని ఎరువుల దుకాణాల పై ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగినది కార్యక్రమంలో భాగంగా పలు దుకాణాల యందు 20:20:0:13 ఎరువులను గరిష్ట చిల్లర ధర కంటే అధికముగా అమ్ముతున్నారని 21.9 మెట్రిక్ టన్నులు సుమారు 7.8 లక్షల రూపాయలు విలువ గల 20:20:0:13 ఎరువులను సీజ్ చేయడం జరిగినది. అదే విధంగా సరైన ధ్రువ పత్రాలు లేనందున 73.7 మెట్రిక్ టన్నుల ఎరువులు ,సుమారు 15.54 లక్షల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేయడం జరిగింది.కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ ప్రతి డీలం FCO 1985 ప్రకారమే వ్యాపారము చేయాలని లేని ఎడల అట్టి డీలర్లపై FCO1985 ప్రకారము కఠిన చర్యలు తప్పవని ఉచ్చరించారు.

# నూతన ఉపసర్పంచుల మండల కార్యవర్గ ఎన్నిక.



**సోన్, (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సోను మండల అధ్యక్షుడు నక్క మధుకర్ రెడ్డి ఆధ్వ ర్యం లోసోన్ మండల ఉప సర్పంచ్ ల కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకోవడం జరిగింది. సోన్ మండల ఉపసర్పంచుల అధ్యక్షులు గడ్డం రాజారెడ్డి ఉపాధ్యక్షులు చెట్పల్లి మహేందర్, కార్యదర్శి దావ మల్లయ్య, కోశాధికారి కాల సాయన్న గాళ్లను ఎన్నుకోవడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సోన్ మండల ఉపసర్పంచులు పాల్గొనడం జరిగింది నూతనంగా ఎన్నికైన ఉపసర్పదుల సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో మా భాగస్వామ్యాన్ని నిష్పక్షపాతంగా పనిచేయడానికి ఎల్లవేళలా ప్రజల సమస్యలను తీర్చడానికి అన్ని విధాలుగా సర్పంచ్లకు అండదండగా ఉంటామని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ సోన్ మండల అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల పథకాలను పక్షపాతం లేకుండా గ్రామ గ్రామాన అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి చేదోడు వాదోడుగా ఉండాలని సోన్ మండల ఉపసర్పంచ్ ల సభ్యులందరికీ తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన సోనీ మండల కమిటీ సభ్యులందరికీ వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు అభినందలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే గల్లా మాధవిని కలిసిన తహసీల్దార్ కిరణ్.



**-మర్యాదపూర్వక భేటీలో పరిపాలనా అంశాలపై చర్చ**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్గా ఇటీవల నియమితులైన కిరణ్ గారు మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గల్లా మాధవి గారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్ గారికి ఎమ్మెల్యే గల్లా మాధవి శుభాకాంక్షలు తెలియజేసి, మండల పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండల పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు తెలిసింది

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమ పాలసీ రూపకల్పనపై కమిటీ కసరత్తు హర్షణీయం



**-పెద్దగోని రమేష్ గౌడ్**

**చౌటుప్పల్ డివిజన్, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** డివిజన్ ఇంచార్జ్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొని త్యాగాలు చేసిన ఉద్యమకారులను గుర్తించి వారికి సముచిత గౌరవం, సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ఆధ్వర్యంలోని కమిటీ చేపడుతున్న కసరత్తు హర్షణీయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు పెద్దగోని రమేష్ గౌడ్ పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో జైలు శిక్షలు అనుభవించిన వారు, పోలీసు కేసులు ఎదుర్కొన్న వారు, అమరవీరుల కుటుంబాలు, క్షతగాత్రులను గుర్తించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందిస్తూ, ఉద్యమకారుల సమగ్ర జాబితా తయారీకి కమిటీ సిద్ధమవడం అభినందనీయమని ఆయన తెలిపారు.ఇతర రాష్ట్రాలలో ఉద్యమకారులకు అమలు చేస్తున్న సంక్షేమ విధానాలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో కూడా సమగ్ర పాలసీ రూపకల్పనకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ కంటే ముందుగా ఏర్పడిన జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఉద్యమకారులకు అమలు చేస్తున్న పథకాలపై కమిటీ విస్తృతంగా అధ్యయనం చేస్తోందని ఆయన వెల్లడించారు.జార్ఖండ్ రాష్ట్రంలో ఉద్యమకారులకు, వారి కుటుంబ సభ్యులకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, జైల్లో గడిపిన కాలాన్ని అర్హతగా పరిగణించి నెలకు రూ.3,500 నుంచి రూ.7,000 వరకు పెన్షన్ అందజేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఉద్యమకారులకు లేదా వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఐదు శాతం సమాంతర రిజర్వేషన్ కల్పించడంతో పాటు ప్రత్యేక గుర్తింపు ప్రమాణపత్రాలను జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించిన, గాయపడిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీ అమలు చేస్తున్నారని, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం సమాంతర రిజర్వేషన్ కల్పిస్తున్నారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల తరహాలో ఉద్యమకారులకు, వారి కుటుంబ సభ్యులకు తగిన గౌరవం, సంక్షేమ పథకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సమగ్ర పాలసీని రూపొందించాలని కమిటీ చేస్తున్న అధ్యయనం ఆశాజనకంగా ఉందని పెద్దగోని రమేష్ గౌడ్ పేర్కొన్నారు.తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు లభించేలా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ ప్రెస్ నోట్కు ప్రధాన శీర్షికగా "తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ పాలసీ రూపకల్పనపై కమిటీ కసరత్తు హర్షణీయం-పెద్దగోని రమేష్ గౌడ్

# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై ఉక్కుపాదం మోపాలి



**-ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి: వీరమళ్ళ కార్తీక్ గౌడ్**

**చౌటుప్పల్ డివిజన్, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై లక్షల రూపాయల ఫీజుల భారం మోపడం అత్యంత ఆందోళనకరమని బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.పేద, మధ్యతరగతి, బీసీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సమయంలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, దానిని వ్యాపారంగా మార్చి లాభాపేక్షతో వ్యవహరించడం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు.విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ కోసం బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకత్వం చేపడుతున్న పోరాటం అభినందనీయమని పేర్కొన్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజు నిర్మాణంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అదనపు ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, రవాణా తదితర సేవల పేరుతో విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్న వ్యవహారాలను అరికట్టేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విద్యాసంస్థలను ప్రభుత్వం ఉపేక్షించరాదన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మరియు పేద విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీసీ యువజన సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ కూడా చేపడతామని వీరమళ్ళ కార్తీక్ గౌడ్ హెచ్చరించారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు."విద్య హక్కు... వ్యాపారం కాదు-ఫీజుల దోపిడీకి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి" అని వీరమళ్ళ కార్తీక్ గౌడ్ స్పష్టం చేశారు

# కడప మున్సిపల్ శానిటరీ కార్మికులకు శుభవార్త



**కడప జిల్లా, (జర్నలిస్ట్ ఫైల్) :** కడప రూ.1.19 కోట్ల జీతాల బకాయిలు విడుదలకడప: గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న కడప మున్సిపల్ శానిటరీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వారికి ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ జీతాల బకాయిల కింద రూ.1.19 కోట్లకు పైగా నిధులను తక్షణమే విడుదల చేయడం జరిగింది. ఈ బకాయిల మొత్తాన్ని నేరుగా కార్మికుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నాం.కార్మికుల ప్రతినిధులతో జరిపిన చర్చలలో వ్యక్తమైన ఇతర ప్రధాన డిమాండ్లపై కూడా ప్రభుత్వం సానుకూల వైఖరిని ప్రదర్శించింది బకాయిల జమ: రూ.1.19 కోట్లకు పైగా పెండింగ్ వేతనాలు కార్మికుల ఖాతాల్లో విజయవంతంగా జమ అయ్యాయి.వేతనాల పెంపు: కార్మికులు కోరిన వేతనాల పెంపు డిమాండ్ను ఇప్పటికే ఉన్నతాధికారుల మరియు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీనిపై త్వరలోనే సానుకూల నిర్ణయం రానుంది.మిగిలిన సమస్యల పరిష్కారం: కార్మికుల ఇతర పెండింగ్ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేస్తున్నాం.నగర పారిశుధ్యాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న శానిటరీ కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. జీతాల బకాయిలు విడుదలైన నేపథ్యంలో, కార్మికులు ప్రజారోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించి, తిరిగి విధుల్లోకి చేరాలని కోరుతున్నాం

# జీడీకే-1డీ3 ఇంక్లైన్‌లో భద్రతా సమీక్ష సమావేశం




**రామ్‌మందిర్ ఏరియా, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే-1డ3 ఇంక్లైన్‌లో ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ (జుడవీ) సిబ్బంది, టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు మరియు అధికారులతో మంగళవారం భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జీడీకే-1డ3 ఏజెంట్ ఎల్. రమేష్, గ్రూప్ ఇంజనీర్ ఎ. ఓదేలు, గని మేనేజర్ సుధీర్ జక్కుల్వార్ హాజరై సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. గని భద్రతతో పాటు ఉత్పత్తి మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై వారు సూచనలు చేశారు. యంత్రాలు, పరికరాలకు క్రమం తప్పకుండా ప్రివెంటివ్ మెయింటెనెన్స్ నిర్వహించడం ద్వారా బ్రేక్‌డౌన్లను తగ్గించవచ్చని తెలిపారు. బొగ్గు, మెటీరియల్ టబ్బులు, రోప్ హాలేజ్ వ్యవస్థలు మరియు అనుబంధ పరికరాలను నిరంతరం తనిఖీ చేసి నిర్వహించాలని సూచించారు. కేబుళ్లను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయడం, సమయపాలన పాటించడం, పనిస్థలాలను ముందస్తుగా తనిఖీ చేయడం, ప్రామాణిక విధానాలు (ఊరాం) ప్రకారం పనులు నిర్వహించడం అవసరమని పేర్కొన్నారు.పనిస్థలాల్లో పరిశుభ్రత (హౌస్ కీపింగ్) పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఉద్యోగి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు.
ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ ఎన్. శ్రీను, పిట్ ఇంజనీర్ పి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వాన్నే శాసించే స్థాయికి కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ




**కడప జిల్లా, (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 22న ఛలో కడప ను జయప్రదం చేయండి ర్ స్ ఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ పిలుపుమైదుకూరు, 16:రాష్ట్రంలో విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చి, ప్రభుత్వాన్ని సైతం శాసించే స్థాయికి చేరిన కార్పొరేట్ సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా విద్యార్థి లోకం కదలిరావాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (=ాఖీ) రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మైదుకూరులోని మేధా జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ, రాబోయే విద్యా సంవత్సరాల్లో శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం వంటి విద్యా సంస్థలు వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారానికి తెరలేపాయని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యను అంగట్లో సరుకుగా మార్చి, నర్సరీ విద్యార్థి నుంచే ?40 వేల నుండి ?2 లక్షల వరకు రకరకాల ఫీజుల పేరుతో తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఫీజులే కాకుండా పుస్తకాలు, యూనిఫామ్స్, బస్సు ఛార్జీల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.అమ్ముడుపోయిన విద్యాశాఖ అధికారులు :ఆంధ్రప్రదేశ్ అధికారిక పాఠశాల విద్యా కమిషన్ నిబంధనలను ఏ ఒక్క ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్ కూడా పాటించడం లేదని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ శక్తులకు అమ్ముడుపోయి, తమకు అందే వాటాల (లంచాల) కోసం నిబంధనల ఉల్లంఘనలను పూర్తిగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విద్యా వ్యాపారాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని ఆర్ఎస్ఎఫ్ (=ాఖీ) ఎంతమాత్రం సహించబోదని హెచ్చరించారు.ఈ నెల 22న ఛలో కడప కలెక్టరేట్ ముట్టడి:విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యారంగ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఈ నెల 22వ తేదీన నిర్వహించ తలపెట్టిన "హలో విద్యార్థి ఛలో కడప కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో =ాఖీ జిల్లా అధ్యక్షులు సి. వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శివ కేశవ, మరియు ముఖ్య నాయకులు అసిఫ్, అక్దాని, రాంతుల్లా, మహమ్మద్, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## - డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**వికారాబాద్, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దీన్‌దయాళ్ బాంగ్‌కు రాష్ట్ర మెడికల్ సెల్ తరపున వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ వైద్య కమిషన్ యోగాను సామర్థ్య ఆధారిత వైద్య విద్యా విధానంలో కీలక భాగంగా చేర్చిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి వైద్య కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది భాగస్వామ్యంతో యోగా దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించవచ్చని పేర్కొన్నారు.యోగ సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత, ఆధ్యాత్మిక వికాసం సాధ్యమవుతుందని చెప్పారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించిన కామన్ యోగా ప్రోటోకాల్‌ను అమలు చేసి, వైద్య విద్యార్థులు, ఇంటర్న్లు, పీజీ విద్యార్థులు, అధ్యాపకులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పాల్గొనేలా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.యోగా శాస్త్రీయ ప్రయోజనాలపై అవగాహన సదస్సులు, శిక్షణా తరగతులు, నివారణ ఆరోగ్య సంరక్షణపై చర్చలు, ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ వైద్యులను సంపూర్ణ ఆరోగ్య విధానాల వైపు నడిపించడమే కాకుండా సమాజంలో ఆరోగ్య అవగాహన రాయబారులుగా తీర్చిదిద్దుతాయని తెలిపారు.వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ఈ కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా నిర్వహించి ఇతర వైద్య విద్యాసంస్థలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ సెల్ సభ్యులు డాక్టర్ స్వప్న శ్రీకాంత్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు అండగా 'భరోసా' కేంద్రాలు

## - అడిషనల్ డీసీపీ రామానుజం



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నారులపై హింసను అరికట్టడానికి, బాధిత మహిళలకు సమగ్ర సేవలను అందించడానికి 'భరోసా' కేంద్రాలు అత్యంత సమర్థవంతంగా పని చేస్తూ అండగా నిలుస్తున్నాయని అడిషనల్ డీసీపీ రామానుజం అన్నారు.హింస, లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, చిన్నారులకు భరోసా కేంద్రాల ద్వారా అందించే సహాయాన్ని, పునరావాస సేవలను బలోపేతం చేయడం కోసం వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో సమన్వయ సమావేశం పోలీస్ కమిషనర్ కార్యాలయం కాన్ఫిరెన్స్ హాల్లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులకు పలు మార్గదర్శకాలు అడిషనల్ డీసీపీ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజం లో దగా పడ్డ మహిళలకు అండగా నిలవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాల ద్వారా పోలీస్, వైద్య, న్యాయ,మానసిక కౌన్సెలింగ్ సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో వేధింపులకు గురైన బాధితులకు మరల ఇటువంటి వాటి బారిన పడకుండా చూడడమే భరోసా సంస్థ యొక్క ముఖ్య లక్ష్యమన్నారు.లైంగిక వేధింపులు, గృహ హింస గురైన మహిళలు, పిల్లలకు తక్షణ రక్షణ, న్యాయ, వైద్య, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందించడంలో భరోసా కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. బాధితులకు చేయూతనిచ్చే ఈ సేవల సమర్థవంతమైన నిర్వహణకు గాను పోలీసు,రెవిన్యూ, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ శాఖల తదితర అధికారులందరూ ఒకే ప్రాంగణంలో ఉండి బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తారన్నారన్నారు. పోలీస్ స్టేషన్, కోర్టుల వాతావరణానికి దూరంగా, బాధితులకు ఎలాంటి భయం లేకుండా సురక్షితమైన, గోప్యమైన వాతావరణంలో సాయం అందేలా చూస్తారన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు, చికిత్స అందించడంతో పాటు నిపుణులైన సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని నింపుతారన్నారని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు నుండి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు న్యాయ నిపుణులు ద్వారా బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించి న్యాయం జరిగేలా చూస్తారన్నారు. బాధితుల కోసం స్వల్పకాలిక ఆశ్రయం, చదువుకునే సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి శిక్షణ ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటును అందిస్తారన్నారు.సమావేశంలో ఐసిపిఎస్ అధికారులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు,సిడబ్లూసి అండ్ జేజేబు సభ్యులు, సభ్యులు, డిఎల్ఎస్ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ ఈఆర్ పి ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కౌన్సిలర్లు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

# గాలి నరసింహారావుకు ఘన నివాళి

## - నరసింహారావు మృతి కుటుంబానికి తీరనిలోటు - మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ



**బోనకల్, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** బోనకల్ గ్రామానికి చెందిన గాలి నరసింహారావు మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్నేహితులు, బంధువులు ఘనంగా నివాళులర్పించారు. నరసింహారావు పార్థివ దేహాన్ని సందర్శించిన మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ , సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాలి నరసింహారావు మరణం వారి కుటుంబానికి మాత్రమే కాకుండా గ్రామానికి కూడా తీరనిలోటని అన్నారు. ఆయన నిరాడంబర జీవనం, అందరితో స్నేహపూర్వకంగా మెలగడం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వల్ల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.నరసింహారావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు. అనంతరం పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మరిదు శేషు, తెలుగు రమేష్, శ్రీనివాస ప్రసాద్ , మంద రమణ, శివ, శ్రీను , గాలి కోటేశ్వరరావు గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంతాపాన్ని తెలియజేశారు.

# గురుకుల కళాశాలలో దోమల నివారణకు పైరెత్రం స్ప్రే





**వికారాబాద్,జూన్ 17(జర్నలిస్ట్ ఫైల్):** వికారాబాద్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర కళాశాల, సుభాష్‌నగర్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దోమల పెరుగుదల నివారణ చర్యలు చేపట్టారు. హాస్టల్ పరిసరాల్లో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు ప్రత్యేకంగా పైరెత్రం మందు స్ప్రే నిర్వహించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు అసిస్టెంట్ మలేరియా అధికారి కె. సత్యం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా వికారాబాద్ సబ్ యూనిట్ అధికారి టి. గౌంగడయ్య మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమల పెరుగుదల ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులకు దోమల కాట్ల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. విద్యార్థులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను అభినంధించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నారులపై లైంగిక వేధింపులు పోక్సో కేసుల్లో, గంజాయి వంటి తీవ్రమైన ఎన్ డిపిఎస్ కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించడం, ప్రాసిక్యూషన్, పోలీసుల సమన్వయంతో నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ నేరస్థులకు జీవిత ఖైదు, 20 ఏళ్ల జైలు శిక్ష మొదలు అనేక కఠిన కారాగారా శిక్షలు పడేలా కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఏడాదిలో ఇప్పటికే ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు అయిన ఐదు పోక్సో కేసుల్లో ఖమ్మం అర్బన్ కేసులో నిందుతుడికి జీవిత ఖైదు, రఘునాథపాలెం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష, ఖమ్మం రూరల్ రెండు వేర్వేరు కేసులో ఏడు, ఐదు సంవత్సరాల జైలు,రఘునాథపాలెం కేసులో మూడు సంవత్సరాల ఆరు నెలల శిక్ష పడ్డాయి.అదే విదంగా గంజాయి వంటి 10 ఎన్ డిపిఎస్ కేసుల్లో ఆరు కేసుల్లో 20 ఏళ్ల కఠిన కారాగారా శిక్ష, మరో రెండు కేసుల్లో 10 ఏళ్ల జైలు, ఒక కేసులో ఏడు ఏళ్ల జైలు, రెండు కేసుల్లో ఏడాది వరకు జైలు శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ అభినందించారు.

# గ్రామ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## - గ్రామ సర్పంచ్ రమేష్ యాదవ్



**కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) :** కేశంపేట మండలం చింతకుంటపల్లి గ్రామంలో మంగళవారం ప్రాథమిక పాఠశాలలో పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసి కొత్త విద్యా సంవత్సరానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నారని అన్నారు.ప్రభుత్వం విద్యార్థుల కోసం ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామ పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుచరిత, షాహీన్, వార్డ్ సభ్యులు బైకని మల్లేష్ యాదవ్, సెక్రటరీ మురళి, నాయకులు శ్రీకాంత్, అనెమోని మల్లేష్ యాదవ్, బాలకృష్ణ, ఆశా వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

# మొదటి రోజు టెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

## - జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో మంగళవారం నిర్వహించిన టీజీ టెట్ జూన్–2026 మొదటి రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటన లో తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన ఏర్పాట్లతో పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరిగాయని తెలిపారు .జిల్లాలోని అను బోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొదటి సెషన్ (ఎఫ్/ ఎన్)లో మొత్తం 145 మంది అభ్యర్థులు కేటాయించగా, 127 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 18 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్ణీత సమయానికి ప్రారంభమై ప్రశాంతంగా కొనసాగింది.రెండవ సెషన్( ఏ/ఎన్ )లో కూడా 145 మంది అభ్యర్థులు కేటాయించగా, 123 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 22 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ సెషన్ కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించబడింది. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయడంతో పాటు భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను కేంద్రంలో అందుబాటులో ఉంచారు. జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి అని తెలిపారు.

# శ్రీవారి సన్నిధిలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, సంగారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రాలు కప్పి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

# వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐ అవగాహన శిక్షణ కార్యక్రమం



**వికారాబాద్, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏఐ అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంపొందించేందుకు ఉపయోగపడింది.కళాశాల ప్రిన్సిపల్ పీవీ గీతాలక్ష్మి పట్నాయక్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ విభాగానికి చెందిన డాక్టర్ సుష్మశ్రీ విద్యార్థులకు ఏఐ ప్రాముఖ్యత, వినియోగాలు మరియు భవిష్యత్తులో దాని అవకాశాలపై వివరించారు.ప్రత్యేకంగా ఐదో సెమిస్టర్ విద్యార్థులకు శిక్షణ అందించి, వారు ఈ అవగాహనను నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న పాఠశాల విద్యార్థులకు చేరవేసే విధంగా మార్గనిర్దేశం చేశారు.డిగ్రీ విద్యార్థులు పాఠశాల స్థాయి విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు ముందుకు రావాలని ప్రిన్సిపల్ సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలి

**- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ భద్రాచలం యూనిట్ డిమాండ్**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** బార్ కౌన్సిల్లో నమోదైన న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులివ్వాలని ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.చైతన్య డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ, తెలంగాణ రాష్ట్ర కమిటీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్ట్ ఆవరణలో న్యాయవాదులతో కలిసి ప్రదర్శించారు. ఈ ధర్నా కార్యక్రమానికి భద్రాచలం బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా భద్రాచలం యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు బండారు అరుణ్ చంద్, పాయం రవివర్మ, జిల్లా కమిటీ సభ్యులు యు గౌతమ్ కుమార్, సీనియర్ న్యాయవాది యం కిషోర్, న్యాయవాదులు ఎ అంజిలి కుమారి, శివకృష్ణ, కోరాడ శ్రీనివాస రావు,విజ్జగిరి రవితేజ, సౌజన్య, పి మధుబాబు, లక్ష్మణ్ మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, భూసేకరణ శాఖల అధికారులతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్, సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ,పెండింగ్ అనుమతులు, సమస్యలపై పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలాల వారీగా భూసేకరణ పురోగతి, భూ సర్వే పనులు, వివిధ ప్యాకేజీల వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలు, కోర్టు కేసులు, అనుమతుల స్థితిగతులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమగ్రంగా చర్చించి, పనులు వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు.భూ సర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైతే అదనపు సర్వేయర్లను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూసేకరణకు సంబంధించిన పెండింగ్ కోర్టు కేసులు, వివిధ అనుమతుల అంశాలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్, భూసేకరణ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టుల అమలుకు అవసరమైన భూమి సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రాజెక్టుల పురోగతి జిల్లాలో అభివృద్ధికి కీలకమని, అందుకే ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, డి ఆర్ ఓ పద్మావతి, ఆర్ డి ఓ మధు,సంబంధిత మండలాల తాసిల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, భూ సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**- నూతన ఎమ్మార్వోకు తెలంగాణ గిరిజన సంఘం వినతిపత్రం**



**బోనకల్, జూన్ 17(జర్నలిస్ట్ ఫైల్) :** బోనకల్ మండలంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం నాయకులు నూతన ఎమ్మార్వోను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముందుగా ఎమ్మార్వోకు శుభాకాంక్షలు తెలియజేసిన సంఘం ప్రతినిధులు అనంతరం గిరిజనుల సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలోని అర్హులైన గిరిజన రైతులకు పట్టా భూములు మంజూరు చేయాలని, సేవాలాల్ మహారాజ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే ఐటీడీఏ ద్వారా గిరిజన యువతకు, రైతులకు అధిక సంఖ్యలో రుణాలు అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు.గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎమ్మార్వో హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు రావూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి బానోతు నాగేశ్వరరావు, 10వ వార్డు సభ్యుడు ధరావత్ కృష్ణ, గిరిజన సంఘం పెద్దలు బానోతు శ్రీరాములు, బానోతు సాధు, రావూరి హుస్సేన్, డీవైఎఫ్ఐ నాయకుడు ధరావత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

**- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ కార్యదర్శి షఫీ వినతి**



**వికారాబాద్, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి. రాంచందర్, జిల్లా కార్యదర్శి ఎండి. షఫీలు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పనిచేస్తూ ప్రభుత్వాలు మరియు ప్రజల మధ్య వారధిగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఎలాంటి గౌరవ వేతనం లేకుండా సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందిస్తామని ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు కాకుండా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఇళ్లు లేక అద్దె భారంతో అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు ఆరోగ్య హెల్త్ కార్డులు మంజూరు చేసి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు హఫీజ్ ఖాన్, గణపురం శ్రీనివాస్, ఎం. వెంకటేష్, పుటుక అనంతయ్య, మొగులయ్య, ఎం. రమేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్ధ సుధాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గడ్డం ప్రసాద్ కుమార్







**వికారాబాద్, జూన్ 17 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అర్ధ సుధాకర్ రెడ్డి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ప్రజలకు ఇంకా ఎక్కువ సేవలు అందించాలని ఆకాంక్షించారు. వికారాబాద్ పట్టణ అభివృద్ధి, పార్టీ బలోపేతంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.పుట్టినరోజు వేడుకలు సన్నిహితులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడగా, పలువురు నేతలు మరియు అభిమానులు అర్ధ సుధాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ జన్మదిన వేడుకలు ఘనంగా సాగాయి.

## తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం



**○ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ**

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గారి అధ్యక్షతన వినుకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసే లక్ష్యంతో రాబోయే నెల రోజుల కార్యాచరణపై సమగ్రంగా వివరించారు. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నిస్సంకర శ్రీనివాసరావు , వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించేలా ఆర్‌టీఈ చట్ట సవరణ చేయాలి



**○ కేంద్ర మంత్రి పెమ్మసానిని కోరిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :ఐదేళ్లకు పైగా సర్వీసు కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కల్పించేలా 2009 విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)లో సవరణ చేయాలని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కలిసి దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యను వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 2028 ఆగస్టు 31లోపు ఐదేళ్లకు పైగా సర్వీసు కలిగిన ఉపాధ్యాయులు టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుందని, లేని పక్షంలో వారి సర్వీసుపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇప్పటికే డీఎస్సీ వంటి నియామక పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాల్లో చేరారని, ఉద్యోగంలో ఉన్న వారిని తిరిగి టెట్ పరీక్ష రాయాలని కోరడం ఇబ్బందికరంగా మారుతోందని వివరించారు. దీనికి తాత్కాలిక పరిష్కారాల కంటే ఆర్‌టీఈ చట్టం 2009లోని సెక్షన్ 23(1)కు పార్లమెంట్ ద్వారా సవరణ చేయడమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రికి అందజేసిన వినతిపత్రంలో, ఆర్‌టీఈ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరి నిబంధనగా మారిందని, అయితే ఇప్పటికే నియామక ప్రక్రియలో అర్హత సాధించి సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పించేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ అంశంపై డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించారని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాస్తానని హామీ ఇచ్చారని డాక్టర్ ఏఎస్ రామకృష్ణ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో స్వయంగా ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని మంత్రి చెప్పినట్లు వెల్లడించారు.

ఇక ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఈ విషయంలో సానుకూలంగా ఉన్నారని వివరించారు. అయితే లక్షలాది మంది ఉపాధ్యాయుల సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం ఆర్‌టీఈ చట్ట సవరణ ద్వారానే సాధ్యమని డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు.

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మలేరియా, ఫైలేరియా విభాగాల సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సంగం జాగర్లమూడి ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ గండు హిమబిందు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా మూడవ బుధవారం ఫైలేరియా క్లినిక్ జరుగుతుందని , అదేవిధంగా ఆయుర్వేద శిబిరం కూడా ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.

ఫైలేరియా పేషంట్ల తో పాటు ఇతర అన్ని జబ్బులకు కూడా మందులు అందుబాటులో ఉన్నందున వైద్య శిబిరము ద్వారా అవసరమైన పేషెంట్లకు తగు ఆయుర్వేదిక్ మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని ఆమె అన్నారు . ప్రతినెలా మూడవ బుధవారం పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ హిమబిందు కోరారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు, అధికారులు రమణ, బాలశౌరి, రవికుమార్, ఉమాకాంత్ లు ఫైలేరియా పేషెంట్లకు అవసరం మందులను మరియు చెప్పులను ఉచితంగా అందజేయబడుతుందని వారు తెలియజేశారు.

కార్యక్రమంలో తెనాలి పట్టణ సబ్ ,ఆయుర్వేద డిస్పెన్సరీ సిబ్బంది బొమ్మనబోయిన రమాదేవి ,తోడేటి ఆనంద్ కుమార్ ఫైలేరియా పర్యవేక్షకులు తిరువీధుల శివరామ ప్రసాద్, మున్నంగి రత్నాకరరావు, షేక్ భాషిత్ ,లేప్రా సొసైటీ సూపర్వైజర్ సాతిరి రమణయ్య , జాన్ బాబు తదితరులు పాల్గొనగా పట్టణ యు యల్ బి సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి మలేరియా వ్యతిరేక మహోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

## మంగళగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి లోకేష్

**○ నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)** : విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృషితో మంగళగిరి నియోజకవర్గ రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. మంగళగిరి ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. నంబూరు-మంగళగిరి సెక్షన్ మార్గంలో మంగళగిరి-నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణ పనులకు ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మంగళగిరి-నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు.

**రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం :** మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ. 142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమరావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్ లో ఈ ప్రాంతంలో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయంలో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది.

నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ రైల్వే లైన్ పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వే లైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్లు రహదారి ఏర్పాటుచేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5x2) 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. సర్వీస్ రోడ్లతో సహా ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, స్వర్ణాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లపై అధ్యయనంలో భాగంగా వినతులు స్వీకరించిన డెడికేషన్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి అధ్యయనం నిర్వహిస్తున్న డెడికేషన్ కమిషన్ ఛైర్మన్ శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా బుధవారం గుంటూరులోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీసీ సంఘాలు మరియు వివిధ వర్గాల నుంచి వినతులు, సూచనలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ల కల్పన, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత, స్థానిక పాలనలో వారి ప్రాతినిధ్యం పెంపు తదితర అంశాలపై అభిప్రాయాలను సేకరించారు. వివిధ వర్గాల నుంచి అందిన వినతులు, సూచనలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఛైర్మన్ తెలిపారు.

ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా సమర్పించి స్థానిక సంస్థలలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర నివేదిక రూపొందించడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఛైర్మన్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డి ఆర్ ఓ ఖాజావలి, ఆర్ డి ఓ శ్రీనివాస రావు, జిల్లా బి సి వెల్ఫేర్ అధికారి మయూరి, జడ్పీ సీఈవో జ్యోతి బసు , ఇతర శాఖల జిల్లా అధికారులు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, యం పి డి ఓ లు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలు, పిల్లల భద్రతపై శక్తి టీమ్స్ ప్రత్యేక దృష్టి పెట్టాలి

**○ పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి**

**○ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మహిళలు, పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శక్తి టీమ్స్ విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు.

పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో శక్తి బృందాలతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణ, ఆకతాయిల వేధింపులకు అడ్డుకట్ట వేయడం, గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సమాజంలో, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను కొందరు విద్యార్థులు తప్పుదారి పట్టించే విధంగా ఉపయోగించే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందిస్తూ పాఠశాలలు, కళాశాలల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని శక్తి టీమ్స్‌కు సూచించారు.

జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, హాస్టళ్లు, ప్రధాన కూడళ్లను తరచూ సందర్శించి మహిళలను వేధించే వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల మాయమాటలకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, స్నేహ సంబంధాలు, మొబైల్ ఫోన్ల వినియోగంపై పర్యవేక్షణ కలిగి ఉండాలని కోరారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి మొబైల్ యాప్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి, అత్యవసర పరిస్థితుల్లో దాని వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సైబర్ భద్రత, గంజాయి దుష్ప్రభావాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాలికలకు స్వీయ రక్షణ శిక్షణ అందించి ఆత్మవిశ్వాసం పెంపొందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీస్ సహాయం కోసం 100 లేదా 112 నంబర్లను సంప్రదించవచ్చని, తక్షణ స్పందన అందిస్తామని ఎస్పీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ శక్తి టీమ్ సభ్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి ప్రభుత్వాన్నిమనసారా ఆశీర్వదించండి

**○ నేడు గుంటూరు తూర్పులో రెండేళ్ల సుపరిపాలన సభ**

**○ హాజరుకానున్న కూటమి ప్రముఖ నాయకులు**

**○ రెండేళ్ల కాలంలో బంగారు భవిష్యత్తుకు బాటలు**

**○ ఏర్పాట్లపై శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే నసీర్**




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రెండేళ్ల కిందట మొదలైన కూటమి ప్రభుత్వ పయనం ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగిందని, ప్రతి గడపలో సంతోషాలు తీసుకొచ్చిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ తెలిపారు. కూటమి సుపరిపాలన రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో నేడు స్థానిక ఎన్ హెచ్ 16 పక్కన సత్యసాయి నగర్ గ్రౌండ్ లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో కూటమి నాయకులతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నవశకానికి నాంది పలికిందని తెలిపారు. హామీల అమలులో అడుగులు ముందుకు పడ్డాయని, చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ పేదవాడి గుండెల్లో వెలుగులు నింపామని చెప్పారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను గుర్తు చేస్తూ ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరావతి, క్వాంటమ్ వ్యాలీ, గూగుల్, సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాల్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. అవ్వాతాతల పెన్షన్ల పెంచామని, పరిశ్రమల స్థాపనతో యువతకు బంగారు బాట వేశామని చెప్పారు. అటు సంక్షేమ పథకాలను లబ్ధిదారులు ఇళ్ల వద్దకు చేరుస్తూనే అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేశామని తెలిపారు.

తల్లికి వందనంతో తల్లిదండ్రులకు భరోసా కల్పించామని, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళల ఉచిత ప్రయాణానికి నాంది పలికామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ తో పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులందరూ కార్యక్రమానికి విచ్చేసి మంచి ప్రభుత్వాన్ని మనసారా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు.

**ఎస్ఐఆర్ తో భద్రతేగానీ భయం లేదు**

ఎస్ఐఆర్ తో ఓటర్లకు భద్రతేగానీ భయం లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించేందుకుగాను స్థానిక తూర్పు కార్యాలయంలో కూటమి నాయకులతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్లందరికీ ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ తో ఓట్లు తొలగిపోతాయనే అపోహ ఎవరూ పెట్టుకోవద్దని చెప్పారు. బీఎల్వోల వద్ద ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని కుటుంబ వివరాలను అందులో నమోదు చేయాలన్నారు. వీటిని బీఎల్వోలకు అందజేయాలని సూచించారు.

## తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తాడికొండ నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఫిరంగిపురం మండలం శ్రీ గ్లోబల్ ఫౌండేషన్‌లో జాబ్ మేళా జరగనుంది. గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా యువతకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొననున్నాయని, మొత్తం 315 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 25 సంవత్సరాల వయసున్న నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా లేదా రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో రావాలని సూచించారు. ఇంటర్వ్యూలు ఈ నెల 19న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయి.

స్థలం: శ్రీ గ్లోబల్ ఫౌండేషన్, రమేష్ వర్మ నివాసం, వేలంకమాత చర్చి ఎదురుగా, మెయిన్ రోడ్, ఫిరంగిపురం మండలం, తాడికొండ నియోజకవర్గం, గుంటూరు జిల్లా. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు ఏ. వెంకట్రావును 89195 08017 నంబర్‌లో సంప్రదించవచ్చు.

## మంత్రి నారా లోకేష్ సేవా స్ఫూర్తితో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సేవా స్ఫూర్తితో బ్రహ్మానందపురం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేశారు. మిడ్ వ్యాలీకి చెందిన నాదెళ్ల క్రాంతి ఆధ్వర్యంలోని మహిళల బృందం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్ బాబుకు పుస్తకాలు, పెన్నులు, రైటింగ్ ప్యాడ్లు, కలర్ పెన్నులు, జ్యామెట్రీ బాక్సులు, వాటర్ బాటిల్స్, భోజనం చేసేందుకు మ్యాట్లు, బీరువా, రెండు ర్యాకులు తదితర సామగ్రిని ్రా4 కార్యక్రమంలో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా నాదెళ్ల క్రాంతి బృందం స్వయంగా కొంతమంది విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేసి, చాక్లెట్లు అందజేసి వారిని ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ వారు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## సర్వీస్ రోడ్లపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు : కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్లపై నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.

బుధవారం కమిషనర్ జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్లు, అమరావతి రోడ్, ఆర్టీఓ కార్యాలయ రోడ్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వీస్ రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నగర పరిధిలో రోడ్లపై చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఇష్టానుసారంగా వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కొబ్బరి బోండాలు వంటి వ్యర్థాలు ఉత్పత్తి చేసే వీధి వ్యాపారులకు రోడ్ల పక్కన వ్యర్థాలు వేయకుండా నోటీసులు ఇవ్వాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలను అపరిశుభ్రంగా మార్చే వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని, డ్రైన్ల నుంచి తీసిన సిల్ట్‌ను రోడ్ల పక్కన వదిలేయకుండా వెంటనే తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం అమరావతి రోడ్, ఆర్టీఓ కార్యాలయ రోడ్ సమీపంలోని అన్న క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. అక్కడ పేదలకు అందిస్తున్న భోజనం నాణ్యత, తాగునీటి సౌకర్యాలు, కూర్చునే వసతులను తనిఖీ చేశారు. క్యాంటీన్లలో లోపల, వెలుపల పరిశుభ్రత పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ పర్యటనలో సీహెచ్ఓ డాక్టర్ శాంతికళ, డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, బయాలజిస్ట్ శేషయ్య, డీఈఈలు రమేష్‌బాబు, వెంకటరమణ, ఎస్-ఎస్ సోమశేఖర్, రాజేష్ తదితర ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# 12 ఏళ్ల మోదీ పాలనలో.. అభివృద్ధి భారతానికి సరికొత్త గుర్తింపు

- సామాన్యుడు సైతం విమానయానం చేయాలి
- దేశ అభివృద్ధికి అసలైన కొలమానం: 2014కు ముందు - మోదీ వచ్చిన తర్వాత
- మౌలిక సదుపాయాల బడ్జెట్ రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.12.02 లక్షల కోట్లకు పెంపు: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ
- దసరా ఉత్సవాల నాటికే నూతన టెర్మినల్ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలి
- గన్నవరం విమానాశ్రయ నూతన టెర్మినల్ నిర్మాణ పనుల పరిశీలన కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** స్వతంత్ర భారత చరిత్రలో దేశ అభివృద్ధిని బేరీజు వేయాలంటే మోదీకి ముందు – మోదీకి తర్వాత అని సగర్వంగా చెప్పుకునే స్థాయికి నేడు భారతదేశం చేరుకుందని, ఒకప్పుడు దేశంలో మౌలిక వసతుల కల్పనకు కేవలం రూ. 2 లక్షల కోట్లు కేటాయిస్తే, నేడు ఆ బడ్జెట్‌ను ఏకంగా రూ. 12.02 లక్షల కోట్లకు పెంచిన ఘనత ప్రధాని మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతూ 12 వసంతాలు పూర్తి చేసుకున్న నరేంద్ర మోదీ పాలనలో మౌలిక వసతుల కల్పనలో నవశకం ప్రారంభమైందని ఆయన కొనియాడారు. ఈ చారిత్రక సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న గన్నవరం (విజయవాడ) విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఇతర బీజేపీ నాయకులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ సంస్థ సిబ్బందిని, అధికారులను అడిగి నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు.

అనంతరం కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ సవరించిన అంచనాల ప్రకారం రూ. 824.28 కోట్ల భారీ వ్యయంతో గన్నవరం విమానాశ్రయ నూతన టెర్మినల్ నిర్మితమవుతోంది అని బేస్‌మెంట్‌తో కలుపుకుని మొత్తం 51,315 చదరపు మీటర్ల విశాలమైన వైశాల్యంలో ఈ నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. ఈ నూతన టెర్మినల్ ద్వారా ఏటా 3.5 మిలియన్ల ప్రయాణీకుల రద్దీని తట్టుకునేలా అత్యుత్తమ డిజైన్ రూపకల్పన తో రద్దీ సమయాల్లో ఒకేసారి 1,200 మంది ప్రయాణీకులను 800 మంది డొమెస్టిక్, 400 మంది ఇంటర్నేషనల్ సునాయాసంగా హ్యాండిల్ చేయగల అద్భుత సామర్థ్యం దీని సొంతం అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇందులో 24 చెక్-ఇన్ కౌంటర్లు, 8 కస్టమ్స్ మరియు ఇమ్మిగ్రేషన్ కౌంటర్లు, 6 ప్యాసింజర్ బోర్డింగ్ బ్రిడ్జ్‌లు , 9 డిపార్చర్ గేట్లు, 10 ఎస్కలేటర్లు, 19 ఎలివేటర్లు ఏర్పాటు అలాగే 648 కార్ల పార్కింగ్ సదుపాయంతో పాటు 1270 మీటర్ల పొడవైన ఎలివేటెడ్ రోడ్డును కూడా నిర్మిస్తున్నామని అని తెలిపారు. ఈ టెర్మినల్ నిర్మాణ పనులను 10 నవంబర్ 2026 నాటికి పూర్తి చేసి, 31 డిసెంబర్ 2026 నాటికి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా లక్ష్యంగా పెట్టుకుందని అయితే విజయవాడలో ఎంతో వైభవంగా నిర్వహించే దసరా ఉత్సవాల నాటికి నూతన టెర్మినల్ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించినట్లు శ్రీనివాస వర్మ తెలిపారు.

ప్రస్తుతం విజయవాడ నుండి కేవలం సింగపూర్‌కు మాత్రమే పాత టెర్మినల్ ద్వారా అంతర్జాతీయ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే, కొత్త టెర్మినల్‌లో మరిన్ని విదేశాలకు విమాన సర్వీసులు పెరిగే అవకాశం పుష్కలంగా ఉందన్నారు. ఉడాన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా వాడుకలో లేని 100 చిన్న విమానాశ్రయాలను అభివృద్ధి చేయడంతో పాటు కొండ, గిరిజన, ద్వీపకల్ప ప్రాంతాల్లో రవాణాను మెరుగుపరచడానికి 200 ఆధునిక హెలిప్యాడ్‌లను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తుందని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది అని త్వరలోనే భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కాబోతుందని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ నాయకత్వంలో పోర్టులు, రైల్వేల అభివృద్ధి, వందే భారత్, అమృత్ భారత్, హై స్పీడ్ కారిడార్లు, జాతీయ రహదారుల నిర్మాణంతో దేశవ్యాప్తంగా కనెక్టివిటీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి వెంట బిజెపి రాష్ట్ర కార్యాలయం ఇంఛార్జి ఉప్పలపాటి శ్రీ నివాస్ రాజు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి కృష్ణా జిల్లా బిజెపి అధ్యక్షుడు తాతినేని శ్రీ రాం, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం, రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, ముప్పల వెంకట సుబ్బయ్య, గుత్తి కొండ శ్రీ రాజా బాబు, పిట్టల గోవిందు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ప్రజల గుమ్మం వద్దకే వైద్య సేవలు



- గుంటూరులో మొబైల్ మెడికల్ వ్యాన్ సేవలు ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని
- ఏడాదికి 12 వేల మందికి వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రాథమిక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో గుంటూరులో మొబైల్ మెడికల్ వ్యాన్ సేవలను ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ సేవలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంటూరు జిల్లా ప్రజలకు సాధారణ వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్సలు, ఆరోగ్య సూచనలు వారి ప్రాంతాల్లోనే అందించేందుకు మొబైల్ మెడికల్ వ్యాన్ ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వైద్య సేవలను వారి వద్దకే తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మొబైల్ మెడికల్ వ్యాన్ నిర్వహణకు ఏడాదికి సుమారు రూ. 45 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఇప్పటికే రెండు మొబైల్ మెడికల్ వాహనాలు సేవలందిస్తున్నాయని, వాటి టెండర్ ప్రక్రియ పూర్తైన తర్వాత తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు. ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులు మాట్లాడుతూ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచనల మేరకు నెలకు సుమారు 1,000 మందికి, ఏడాదికి దాదాపు 12,000 మందికి ప్రయోజనం కలిగేలా మొబైల్ మెడికల్ వ్యాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

## హైస్కూల్ ప్లస్-2లో ఖాళీ సబ్జెక్ట్ పోస్టులు భర్తీ చేయాలి



- పాఠశాల కమిషనర్‌ను కలిసి ఉపాధ్యాయ సమస్యలపై వినతి అందించిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణ

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** హైస్కూల్ ప్లస్–2 పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళగిరిలోని విద్యా భవన్‌లో పాఠశాల కమిషనర్ తమీమ్ అన్సారియాను కలిసి ఉపాధ్యాయుల వివిధ సమస్యలపై ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్లస్–2లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు సంవత్సరానికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహించాలని, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేల్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. 2018 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 2021లో నియమితులైన తెలుగు ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీసు వర్తింపజేయాలని, 2025లో పదోన్నతి పొందిన లాంగ్వేజ్ పండిట్లకు 2019 నుంచి నోషనల్ సర్వీసు అమలు చేయాలని కోరారు.

అలాగే ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆంధ్ర వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సస్పెన్షన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాలలో జనరల్ సర్జరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌ను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు.

పీజీ విద్యార్థులను అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నారని, విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ అందిన ఫిర్యాదులపై కళాశాల యాజమాన్యం విచారణ చేపట్టింది. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి నేతృత్వంలో అంతర్గత కమిటీని ఏర్పాటు చేసి విచారణ నిర్వహించారు. కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు డాక్టర్ జనార్దన్ రావును సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను డిప్లాయ్‌మెంట్ ద్వారా పరిష్కరించాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న హెడ్‌మాస్టర్ గ్రేడ్–II, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా తక్షణమే భర్తీ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (టీూా) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం. 70, తేదీ 15–06–2026 ప్రకారం పదోన్నతులకు అవకాశం ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా ప్రమోషన్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయుల కొరతను డిప్లాయ్‌మెంట్ విధానం ద్వారా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యా కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఖాళీల భర్తీ ద్వారా అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి అవకాశాలు లభించడంతో పాటు పాఠశాలల పరిపాలనా సామర్థ్యం, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## అన్నమయ్య జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేస్తాం





- నూతన జిల్లా అధ్యక్షుడిగా పులి నరేంద్ర కుమార్ రెడ్డి బాధ్యతల స్వీకారం

**మదనపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షుడిగా పులి నరేంద్ర కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లిలో నిర్వహించిన బాధ్యతల స్వీకార కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ జకియా ఖానం, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సానారెడ్డి దయాకర్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో నూతన జిల్లా అధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వం అందిస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని, యువత, మహిళలు, రైతులు, బడుగు బలహీన వర్గాలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, కేంద్ర పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పీవీఎన్ మాధవ్ సూచించారు. నూతన జిల్లా అధ్యక్షుడి నాయకత్వంలో అన్నమయ్య జిల్లాలో బీజేపీ మరింత బలపడడంతో పాటు ప్రజలకు మరింత చేరువ అవుతుందని నాయకులు ఆకాంక్షించారు.

## యోగాంధ్ర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, విద్యార్థులు

- ప్రభుత్వ వైద్య , నర్సింగ్, డెంటల్ కాలేజీల నుంచి 15,173 మంది యోగాంధ్ర పోర్టల్ ద్వారా నమోదు
- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ వెల్లడి





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** 'యోగాంధ్ర–2026 'కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య విద్యా సంస్థల నుంచి భారీ స్పందన లభిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య, దంత, నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, వైద్యులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జూన్ 7 నుంచి 17 వరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని సంస్థల్లో మొత్తం 15,173 మంది తమ పేర్లను పోర్టల్ లో నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే అత్యధికంగా 10,792 మంది నమోదు చేసుకున్నారని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. పోర్టల్లో నమోదు చేసుకున్న వారిలో కొంత మంది స్థానికంగా నిర్వహించే యోగాసనాల్లో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్ నుంచి 1,625 మంది, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ నుంచి 1,400 మంది, గుంటూరు మెడికల్ కాలేజ్ నుంచి 1,091 మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 800 మంది, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 840 మంది నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ దంత వైద్య కళాశాలల్లో విజయవాడ, కడప కళాశాలల నుంచి కలిపి 560 మంది నమోదు చేసుకున్నారు. నర్సింగ్ కళాశాలల్లో 3,821 మంది యోగా సాధన చేశారు. ఒంగోలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల 452 మందితో అగ్రస్థానంలో నిలవగా, కర్నూలు 432 మంది, ఏలూరు 377 మంది, కడప 332 మంది, తిరుపతి 315 మందితో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న విజయవాడలోని ఇందిరాంధీ మునిసిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి వైద్య విద్యాసంస్థలు పెద్ద ఎత్తున మద్దతిస్తున్నాయని అధికారులు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్న సందేశాన్ని వైద్య విద్య, నర్సింగ్ విద్యార్థులు, డాక్టర్లు, సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని డిఎంఈ పేర్కొన్నారు. డిఎంఈ పరిధిలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, 2 ప్రభుత్వ దంత వైద్య కళాశాలలు ఉన్నాయి

## మంగళగిరి వైకుంఠ మహాప్రస్థానాన్ని సందర్శించిన మంత్రి లోకేష్

- రూ.3.25 కోట్ల వ్యయంతో హిందూ శ్మశాన వాటిక ఆధునీకరణ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** పాత మంగళగిరి బిట్రావారి వీధి, దింపుడు కళ్లం వద్ద ఆధునిక సదుపాయాలతో నిర్మించిన మంగళగిరి వైకుంఠ మహాప్రస్థానాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి వైకుంఠ మహాప్రస్థానాన్ని ఆధునీకరించారు. మొత్తం 2.90 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించారు. ఇందులో 1.90 ఎకరాలు హిందూ శ్మశానవాటిక కాగా.. మరో ఎకరం క్రైస్తవుల సమాధుల కోసం కేటాయించారు. హిందూ వైకుంఠ మహాప్రస్థానాన్ని ఫీనిక్స్ ఫౌండేషన్ రూ. 3.25 కోట్ల సీఎస్ఆర్ నిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి చేశారు. దీంతో పాటు మంత్రి లోకేష్ సొంత నిధులను కూడా వెచ్చించారు.

ఈ ప్రాజెక్ట్ లో భాగంగా నాలుగు ఆధునిక దహన వేదికలు(ఉడ్ ఫైర్స్), వాటి ఎదురుగా నాలుగు నిరీక్షణ మందిరాలు, అంత్యక్రియలకు హాజరయ్యే బంధువుల సౌకర్యార్థం ఒకేసారి 60 మంది కూర్చోవడానికి వీలుగా భోజనశాల నిర్మించారు. భోజనశాల పక్కనే కార్యాలయంతో పాటు అస్థికలు భద్రపరిచే గది నిర్మించారు. పిండ ప్రదానాల కోసం రెండు ప్రత్యేక ఆచార గదులు, స్టోర్ రూమ్, క్షౌరశాల ఏర్పాటుచేశారు. పురుషులు, మహిళలకు రెండు వేర్వేరు మరుగుదొడ్లు, దహన సంస్కారాలకు కలప నిల్వ చేసేందుకు ప్రత్యేక షెడ్, రెండు మార్చురీ బాక్స్ లు, విద్యుత్ అంతరాయం లేకుండా 15 కేవీఏ సామర్థ్యం గల జనరేటర్ ఏర్పాటు చేశారు. ఆవరణలో సుందరీకరణ పనులు, శిల్పాలు, సోలార్ వీధి దీపాలు, కార్యాలయ, భోజనశాల ఫర్నీచర్, నిరీక్షణ మందిరాల కోసం 50 కుర్చీలు ఏర్పాటుచేశారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి రమేష్ తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## 108 ఫీడర్ అంబులెన్స్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- 8 ఏళ్లుగా వేతన పెంపు లేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న 108 ఫీడర్ అంబులెన్స్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని 108 ఫీడర్ అంబులెన్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏ.వి. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి. ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో 2018 నుంచి ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నెలకు కేవలం రూ. 12 వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, గత 8 సంవత్సరాలుగా ఎలాంటి వేతన పెంపు అమలు కాలేదని పేర్కొన్నారు. 108 ఈఎంటీ ఉద్యోగులతో సమానంగా ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగుల వేతనాలను పెంచి నెలకు కనీసం రూ. 25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు యూనిఫామ్‌లు, రెయిన్‌కోట్లు, షూస్, ఏప్రాన్లు, గ్లౌజులు వంటి రక్షణ సామగ్రిని అందించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న వాహనాలు సరైన స్థితిలో లేకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొత్త వాహనాలు, టూల్ కిట్లు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. కేసుల తరలింపునకు అయ్యే ఖర్చులు, టీఏ, డీఏలు చెల్లించాలని, రిలీవర్లకు గతంలో మాదిరిగా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

వాహనాల ఇంధన సరఫరాలో పెట్రోల్ బంకులు, ఓటీపీ సమస్యలను పరిష్కరించాలని, రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల భద్రత కోసం ఐడీ కార్డులు జారీ చేయాలని తెలిపారు.

ఈఎస్ఐ కట్ అవుతున్నప్పటికీ కార్డులు అందలేదని, వెంటనే జారీ చేయాలని కోరారు. అలాగే వాహనాల పార్కింగ్‌కు సరైన షెడ్లు ఏర్పాటు చేయాలని, పీహెచ్‌సీల్లో అటెండర్ సిబ్బంది చేయాల్సిన పనులను అంబులెన్స్ ఉద్యోగులకు అప్పగించకుండా వైద్యాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని యూనియన్ నాయకులు కోరారు.

## చేనేత కార్మికులు, కళాకారులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలివ్వాలి



- సీఎం చంద్రబాబుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ వినతి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని చేనేత కార్మికులు, కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయి చేనేత పురస్కారాలివ్వాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు బుధవారంనాడు ముఖ్యమంత్రికి మంత్రి సత్యకుమర్ యాదవ్ లేఖ రాశారు.

" ఆంధ్రప్రదేశ్ చేనేత రంగం రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, శ్రీకాళహస్తి, బొబ్బిలి, భట్టిప్రోలు, మదనపల్లె వంటి ప్రాంతాల చేనేత ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత పురస్కారాల ద్వారా ప్రతిభావంతులైన చేనేతలను సత్కరిస్తోంది.

ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక పురస్కారాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. దీంతో చేనేత కార్మికులకు గౌరవం పెరగడంతో పాటు యువతలో ఈ వృత్తిపట్ల ఆసక్తి పెరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు 7న నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి పురస్కారాలను ప్రదానం చేయాలి. చేనేతలు, డిజైనర్లు, కళాకారులకు ఇది గొప్ప ప్రోత్సాహంగా నిలుస్తుంది.

చేనేత రంగం రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి అమలు చేయాలి " అని ముఖ్యమంత్రిని మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖలో కోరారు.

కాగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత అంజయ్య, ధర్మవరానికి చెందిన జేఆర్ సిల్క్ చీరల సంస్థ యజమాని జింకా రామాంజనేయులు రాష్ట్రంలో చేనేత పురస్కారాలివ్వాలని కోరుతూ సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ముఖ్యమంత్రికి పంపినట్లు మంత్రి తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467